



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక
ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక :152 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తిరుపతి ఆదివారం 14 జూన్ 2026 వెల : 5/-రూ ॥
VOLUME :1 ISSUE :152 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : TIRUPATI SUN 14 JUNE 2026 PRICE : 5/- RS
Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur



## భారత సైన్యానికి కొత్త చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్

- కొత్త ఆర్మీ చీఫ్‌గా ధీరజ్ సేథ్
- జూన్ 30న బాధ్యతల స్వీకరణ
- ఉపేంద్ర ద్వివేది అదే రోజు రిటైర్
- 1986లో సైన్యంలో చేరిన సేథ్
- పలు కీలక కమాండ్లకు నాయకత్వం
- సైన్యం ఆధునికీకరణలో కీలక పాత్ర

**పెన్ పవర్ డెస్క్:**భారత సైన్యానికి కొత్త ఆర్మీ చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఆయన వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జూన్ 30న కొత్త ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.ప్రస్తుత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది అదే రోజు పదవీ విరమణ చేయనున్నారు. దీంతో ధీరజ్ సేథ్ భారత సైన్యానికి తదుపరి అధిపతిగా బాధ్యతలు చేపట్టనున్నారు. సేథ్ నేషనల్ డిఫెన్స్ అకాడమీలో శిక్షణ పొందారు. 1986 డిసెంబర్‌లో ఆర్మర్డ్ కార్ప్స్‌లో అధికారిగా సైన్యంలో చేరారు. దాదాపు 40 ఏళ్లకు పైగా సాగిన సైనిక జీవితంలో కీలక బాధ్యతలు నిర్వహించారు.ఎడారి ప్రాంతాల్లో ఆర్మర్డ్ రెజిమెంట్‌కు నాయకత్వం వహించిన ధీరజ్ సేథ్, పశ్చిమ సరిహద్దు ప్రాంతంలో ఆర్మ్‌డ్ బ్రిగేడ్‌కు కమాండర్‌గా పనిచేశారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలను పర్యవేక్షించే దళాలకు కూడా నాయకత్వం అందించారు. లెఫ్టినెంట్ జనరల్ హోదాలో భారత సైన్యంలో అత్యంత కీలకమైన స్ట్రైక్ ఫార్మేషన్లలో

- మిగతా 2లో



## వెన్నుపోటు, గొడ్డలివేటుకు జగన్ బ్రాండ్ అంబాసిడర్

- హామీలన్నీ ఉల్లంఘించి ప్రజలను, యువతను, రైతులను జగన్ మోసం చేశారని ఆరోపణ
- కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తోందని వెల్లడి
- జగన్ రెడ్డి కుట్రల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపు
- డీఎస్సీ, పోలీసు ఉద్యోగాలతో పాటు అనేక హామీలను ఇప్పటికే అమలు చేశామని స్పష్టం

- మిగతా 2లో



## రెండేళ్లలోనే కూటమి ప్రభుత్వం విఫలం

- నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయన్న బొత్స
- రైతులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని విమర్శ
- సూపర్ సిక్స్ పథకాలు ఏమయ్యాయని నిలదీత

**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తికాకముందే అన్ని రంగాల్లో విఫలమైందని వైసీపీ శాసనమండలి పక్ష నేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. ఈరోజు విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడిన ఆయన, ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరగడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని

- మిగతా 2లో

## పెట్టుబడులే లక్ష్యం.. నేడు సింగపూర్‌కు

# సీఎం చంద్రబాబు

- సింగపూర్ పర్యటనలో కీలక భేటీలు
- సింగపూర్ ప్రధాని, మంత్రులు, పారిశ్రామికవేత్తలతో సమావేశం
- అమరావతి నిర్మాణంపై సుర్బానా జురాంగ్ సంస్థతో చర్చలు
- 2026 సీఐఐ భాగస్వామ్య సదస్సు రోడ్‌షోలో పాల్గొననున్న ముఖ్యమంత్రి



**పెన్ పవర్ డెస్క్:**ఏపీకి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు సింగపూర్‌లో పర్యటించను న్నారు. జూన్ 14 నుంచి సాగే ఈ పర్యటనలో రాష్ట్రానికి, ముఖ్యంగా రాజధాని అమరావతి నిర్మాణానికి నిధులు సమీకరించడంపై ఆయన ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ఇందు కోసం ఉదయం బెంగళూరు నుంచి ఆయన సింగపూర్‌కు బయలుదేరి వెళ్లనున్నారు. ముఖ్యమంత్రి వెంట పురపాలక శాఖ మంత్రి నారాయణ, పలువురు ఉన్నతాధికారులు కూడా ఈ పర్యటనకు వెళ్లనున్నారు.పర్యటనలో భాగంగా చంద్రబాబు సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో పాటు ఆ దేశ ఉప ప్రధాని, వాణిజ్య మంత్రి గాన్ కిమ్ యాంగ్, విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్, హోం మంత్రి షణ్ముగమ్ వంటి కీలక నేతలతో సమావేశమవుతారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను, ప్రభుత్వ విధానాలను వారికి వివరించనున్నారు. తొలుత సింగపూర్‌లోని భారత హై కమిషనర్ శిల్పక్ అంబులేతో భేటీ అయి పర్యటన అజెండాపై చర్చిస్తారు. పారిశ్రామిక,

- మిగతా 2లో



## అన్ని ప్రాంతాలకూ అభివృద్ధి.. హెల్త్‌కేర్‌లో ప్రెడిక్టివ్ విధానం

- అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న సత్యకుమార్
- ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని వ్యాఖ్య
- ప్రజల వద్దకే వెళ్లి 45 రకాల వైద్య సేవలు అందిస్తున్నామని వెల్లడి

- మిగతా 2లో

## బీజేపీ ఓటు చోరీ మాత్రమే కాదు.. సీటు చోరీ కూడా చేస్తోంది



**పెన్ పవర్ డెస్క్:** బీజేపీ ఓటు చోరీ మాత్రమే కాదు.. సీటు చోరీ కూడా చేస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణను తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. బలం లేని చోట మూడో అభ్యర్థిని నిలబెట్టడం బీజేపీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనన్నారు. శనివారం (జూన్ 13) నల్లగొండ ఎంఎన్ఆర్ గార్డెన్స్‌లో కాంగ్రెస్ బీఎల్ఏల కోసం ఎస్ఐఆర్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా నడుస్తోందని అన్నారు.
రాహుల్ గాంధీని ప్రధానిగా చేసుకోవడమే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రతి పౌరుడి ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాడుతోందని తెలిపారు.

- మిగతా 2లో



## ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు.. వేలాది ఉద్యోగాలు: మంత్రి టీజీ భరత్

- పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్న భరత్
- కర్నూలులో నిర్వహించిన జాబ్‌మేళాలో 19 కంపెనీలు పాల్గొన్నాయని వెల్లడి
- రిలయన్స్, అగస్త్య సంస్థలను కర్నూలుకు తీసుకువచ్చామన్న మంత్రి

2లో



## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం.. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వాంగ్మూలం నమోదు

- తుమ్మల నివాసానికి వెళ్లి వాంగ్మూలాన్ని నమోదు చేసిన సిట్
- తుమ్మల ఫోన్ ట్యాప్ అయినట్టు ప్రాథమిక విచారణలో గుర్తింపు
- తుమ్మల ఫోన్ కాల్స్, లొకేషన్ డేటా వివరాలు సేకరించిన సిట్

**పెన్ పవర్ డెస్క్:**తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఈరోజు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నివాసానికి వెళ్లి ఆయన వాంగ్మూలాన్ని అధికారికంగా నమోదు చేసింది. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో అక్రమంగా

- మిగతా 2లో

## యుద్ధాన్ని ముగించేందుకు సమయం ఆసన్నమైంది మిత్రమా!

# నెతన్యాహుతో ట్రంప్

- ఇరాన్‌తో ఒప్పందం కొన్ని రోజుల్లోనే కుదిరే అవకాశం
- నెతన్యాహుకు ట్రంప్ ఫోన్‌లో స్పష్టమైన సందేశం
- 60 రోజుల కాల్పుల విరమణకు ప్రతిపాదనలు
- హర్మూజ్ జలసంధి పునఃప్రారంభం ప్రతిపాదన
- అణు కార్యక్రమంపై ఇరాన్‌తో మరిన్ని చర్చలు



**పెన్ పవర్ డెస్క్:**ఇరాన్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తతలకు త్వరలోనే తెరపడే అవకాశం కనిపిస్తోంది. ఈ మేరకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలుస్తోంది. ఇరాన్‌తో శాంతి ఒప్పందం కేవలం మరికొన్ని రోజుల్లోనే కుదిరే అవకాశముందని ఆయనకు తెలిపినట్లు యాక్సియోస్ కథనం వెల్లడించింది. "ఇది మంచి ఒప్పందం.. యుద్ధాన్ని ముగించే సమయం వచ్చేసింది" అని నెతన్యాహుకు ట్రంప్ చెప్పినట్లు సమాచారం.

- మిగతా 2లో

## ఆర్‌జీయూకేటీలకు 4,040 విద్యార్థులు ఎంపిక

**పెన్ పవర్ డెస్క్:**రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(ఆర్‌జీయూకేటీ)లో బీటెక్ ప్రవేశాల ఫలితాలను మంత్రి లోకేశ్ విడుదల చేశారు. నూజివీడు, ఆర్‌కే వ్యాలీ, ఒంగోలు, శ్రీకాకుళంలో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన తాత్కాలిక ఎంపిక జాబితా విడుదలైనట్లు వెల్లడించారు. మొత్తం 4,410 దరఖాస్తులు రాగా.. 4,040 మంది మాత్రమే ఎంపికైనట్లు తెలిపారు.

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# ఏపీలో 6, తెలంగాణలో 4..

### మూడు ముక్కలుగా లోక్‌సభ నియోజకవర్గాలు

దేశంలో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి తాజాగా నియోజకవర్గాల పునర్విభజన అంశానికి సంబంధించి కీలక ప్రతిపాదనలతో సిఫార్సులు చేసింది. ప్రస్తుతం ఉన్న 543 స్థానాలను 824 నియోజకవర్గాలకు పెంచాలని పేర్కొంది. ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి ప్రస్తుతం ఉన్న 543 నియోజకవర్గాలలోని 59 స్థానాలను రెండుగా, 111 స్థానాలను మూడు నియోజకవర్గాలుగా విభజించాలని సూచించింది. నియోజకవర్గాల విభజనకు.. గత ఎన్నికల్లో పోలింగ్ శాతంతో పాటుగా పట్టణ, ఎస్సీ, ఎస్టీ, మహిళల జనాభా సహా పలు కీలక అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచనలు చేసింది. ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన పలు నియోజకవర్గాలు మూడుగా, రెండుగా విభజించాలని సూచించింది.ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, రాజంపేట, కడప, అనంతపురం, కర్నూలు, నంద్యాల నియోజకవర్గాలను మూడుగా, మచిలీపట్నం నియోజకవర్గాన్ని రెండుగా చేయాలని సూచించింది. తెలంగాణ విషయానికి వస్తే.. హైదరాబాద్, సికింద్రాబాద్, మల్క?జ్‌గిరి, మెదక్‌లను మూడుగా, చేవెళ్లను రెండుగా విభజించాలని సిఫార్సు చేసింది. దీని ప్రకారం నియోజకవర్గాలను విభజన వల్ల 2.32% ఓటింగ్ పెరుగుతుందని.. 2.23 కోట్ల మంది అదనంగా ఓటేస్తారని చెబుతున్నారు. తాజా సిఫార్సుల్ని బట్టి నియోజకవర్గాలను విభజిస్తే ఆంధ్రప్రదేశ్‌లో 3.52%, తెలంగాణలో 6.55% ఓటింగ్ పెరిగే అవకాశం ఉంటుందంటున్నారు. జనాభా, పట్టణీకరణ, ఎస్సీ జనాభా, ఎస్టీ జనాభా, భాషాపరమైన పోలరైజేషన్, భాషాపరమైన వైవిధ్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.ప్రధాని ఆర్థిక సలహామండలి సమర్పించిన సిఫార్సుల్లో తెలుగు రాష్ట్రాల నుంచి మూడుగా విభజించే లోక్‌సభ నియోజకవర్గాల్లో ఆరు నగరాలు ఉన్నాయి. వీటిలో హైదరాబాద్ నియోజకవర్గం భాషాపరమైన పోలరైజేషన్ స్కోర్ 0.12 ఉంది. హైదరాబాద్ నియోజకవర్గం పరిధిలో ఉర్దూ మాట్లాడేవారు 10.66 లక్షలమంది ఉన్నారు.. తెలుగు మాట్లాడేవారు 28శాతం, హిందీ మాట్లాడేవారు 5.15శాతం ఉన్నారు. ఈ మేరకు హైదరాబాద్ నియోజకవర్గాన్ని మూడుగా విభజించాలని సిఫార్సు చేసింది. ఇలా భాషాపరమైన పోలరైజేషన్ ఉన్నచోట్ల ఓటింగ్ శాతం 11 నుంచి 13 శాతం అధికంగా నమోదవుతుందని భావిస్తున్నారు.. ఇక సికింద్రాబాద్‌లో పోలరైజేషన్ స్కోర్ (0.120)గా ఉంది. హైదరాబాద్ నియోజకవర్గాన్ని మూడుగా విభజిస్తే.. ప్రతి నియోజకవర్గంలో 27.87 పర్సంటేజ్ పాయింట్ల మేర ఓటింగ్ పెరిగే అవకాశం ఉందని అంచనా వేశారు. సికింద్రాబాద్‌ను మూడుగా విభజస్తే 26.93 పర్సంటేజ్ పాయింట్లు వస్తాయని భావిస్తున్నారు.ఏపీ విషయానికి వస్తే.. నంద్యాల (0.117), రాజంపేట (0.114), కడప (0.105), విశాఖపట్నం (0.052) పోలరైజేషన్ ఉంది. విశాఖపట్నం నియోజకవర్గాన్ని మూడుగా విభజిస్తే 15.88 పర్సంటేజ్ పాయింట్లు, కడప నియోజకవర్గం విభజనతో 15.39 పర్సంటేజ్ పాయింట్లు, రాజంపేట 14.47 పర్సంటేజ్ పాయింట్లు, నంద్యాల 14.22 పర్సంటేజ్ పాయింట్ల మేర ఓటింగ్ పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. ప్రధాని ఆర్థిక సలహామండలి సమర్పించిన సిఫార్సుల ప్రకారం పెద్ద రాష్ట్రాల్లో సీట్లు 50శాతం పెరగనున్నాయి. చిన్న రాష్ట్రాల్లో సీట్ల సంఖ్యను నేరుగా రెట్టింపు చేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ సీట్లు 25 నుంచి 38కి, తెలంగాణ లోక్‌సభ సీట్లు 17 నుంచి 26కు, కర్ణాటక సీట్లు 28 నుంచి 42కు, తమిళనాడు సీట్లు 39 నుంచి 59కి, కేరళ లోక్ సభ సీట్లు 20 నుంచి 30కి పెరుగుతాయి. అన్ని నియోజకవర్గాలను కాకుండా170 నియోజకవర్గాలను విభజిస్తే సరిపోతుందని సిఫార్సు చేశారు. అందుకే 59 నియోజకవర్గాలను రెండుగా.. 111 నియోజకవర్గాలను 3గా చేయాలని పేర్కొన్నారు. వచ్చే పార్లమెంటు సమావేశాల్లో మరోసారి నియోజకవర్గాల పునర్విభజన బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉందంటున్నారు.

# వెన్నుపోటు, గొడ్డలివేటుకు జగన్ బ్రాండ్ అంబాసిడర్

ప్రజలు ఇచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేసి రాష్ట్రాన్ని అన్ని విధాలుగా నాశనం చేసిన జగన్ ను మించిన వెన్నుపోటుదారుడు మరొకరు లేరని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "వెన్నుపోటుకు, గొడ్డలివేటుకు జగన్ రెడ్డి బ్రాండ్ అంబాసిడర్" అని ఆయన అభివర్ణించారు. శనివారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జగన్ ఐదేళ్ల పాలనపై నిప్పులు చెరిగారు. ఎన్నికల్లో గెలిచేందుకు అడ్డగోలు హామీలిచ్చి, అధికారంలోకి వచ్చాక వాటన్నింటినీ తుంగలో తొక్కిన దుర్మార్గుడు జగన్ అని రవీంద్ర విమర్శించారు. సొంత బాబాయి హత్య కేసులో నిందితులకు కొమ్ముకాస్తూ, తోడబుట్టిన చెల్లిపైనే నిందలు వేసిన నీచమైన మనస్తత్వం జగన్‌ది అని ఆరోపించారు. ఆయన ఐదేళ్ల అరాచక పాలన, మోసపూరిత వైఖరిని చూసిన ప్రజలు 'ఈ సైకో మాకొద్దు' అంటూ ఎన్నికల్లో కూటమికి 94 శాతం సీట్లు కట్టబెట్టారని గుర్తుచేశారు. కేవలం 11 సీట్లకే పరిమితమైనా సిగ్గులేకుండా ఇంకా కుట్రలనే నమ్ముకుని, ప్రజాసంక్షేమం కోసం నిబద్ధతతో పనిచేస్తున్న ప్రభుత్వంపై నీచమైన కుతంత్రాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. జగన్ తన పాలనను ప్రజావేదిక కూల్చివేతతో ప్రారంభించారని, సంపూర్ణ మద్యపాన నిషేధం హామీని గాలికి వదిలేసి, కల్తీ బ్రాండ్లు, సొంత కంపెనీల మద్యంతో ప్రజల జేబులు కొల్లగొట్టి తాడేపల్లి ప్యాలెస్ ఖజానా నింపుకున్నారని ఆరోపించారు. ఈ కల్తీ మద్యం కారణంగా రాష్ట్రంలో సుమారు 30 వేల మంది మహిళలు మాంగళ్యాలు కోల్పోయారని, లక్షలాది మంది అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
విద్యుత్ ఛార్జీలను 9 సార్లు పెంచి రూ.32 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపారని, పీపీఏలు రద్దు చేసి విద్యుత్ సంస్థలకు రూ.1.29 లక్షల కోట్ల నష్టం కలిగించారని విమర్శించారు.

మెగా డీఎస్సీ, ఏటా జాబ్ క్యాలెండర్ అంటూ యువతను దారుణంగా మోసం చేశారని, జగన్ రెడ్డి దగాకోరు మాటల వల్ల గత ఐదేళ్లలో 4100 మంది యువకులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని కొల్లు రవీంద్ర ఆరోపించారు. 'అమ్మఒడి' పథకాన్ని కొందరికే పరిమితం చేసి విద్యార్థులను, జీవో నెం.117తో పేదలకు పాఠశాలలను దూరం చేసి బడుగు బలహీన వర్గాల ప్రజలను వెన్నుపోటు పొడిచారని అన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే ఆ జీవోను రద్దు చేసిందని గుర్తుచేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు చెందిన వందలాది సంక్షేమ పథకాలను రద్దు చేసి, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు కుదించి ఆ వర్గాలకు తీరని ద్రోహం చేశారని విమర్శించారు. అమరావతే రాజధాని అని చెప్పి, గెలిచాక మూడు రాజధానుల నాటకంతో రాష్ట్రాన్ని, రైతులను మోసం చేశారని అన్నారు. పొరుగు రాష్ట్ర ప్రయోజనాల కోసం పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించి రాష్ట్ర రైతాంగానికి తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. ఆస్తిలో వాటా అడిగినందుకు చెల్లిని, ఆమెకు అండగా నిలిచిన కన్నతల్లిని ఇంటి నుంచి గెంటేసిన వ్యక్తి జగన్ అని, ఆయన లాంటి క్రూర మనస్తత్వం ఉన్న వ్యక్తిని రాజకీయంగా సమాధి చేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తోందని, సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తోందని కొల్లు రవీంద్ర తెలిపారు. "సూపర్ సిక్స్" హామీలను అమలు చేస్తూ, అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని అన్నారు. ఇప్పటికే 16,400 టీచర్ పోస్టులు, 6000 కానిస్టేబుల్ ఉద్యోగాలు భర్తీ చేస్తున్నామని, 20 లక్షల ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతో పరిశ్రమలను ఆకర్షిస్తున్నామని వివరించారు. విభజన నష్టం కంటే జగన్ పాలనలో జరిగిన నష్టమే ఎక్కువని, ఆయన కుట్రల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి, గొడ్డలి పార్టీని భూస్థాపితం చేయాలని కోరారు.

# అన్ని ప్రాంతాలకూ అభివృద్ధి.. హెల్త్‌కేర్‌లో ప్రెడిక్టివ్ విధానం

ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి, అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. తిరుపతి సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సైతం ఇదే విషయాన్ని ప్రజలకు స్పష్టంగా వివరించారని గుర్తుచేశారు. గత రెండేళ్ల కాలంలో వైద్య ఆరోగ్య శాఖలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు, భవిష్యత్ ప్రణాళికలను మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన, ఉచిత వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగి వివరాలను, వారి వైద్య చరిత్రను పూర్తి స్థాయిలో డిజిటలైజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఓపీ సేవల నుంచి స్పెషలిస్ట్ వైద్య సేవల వరకు అనేక సంస్కరణలు అమలు చేశామన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో సాంప్రదాయ వైద్య విధానాల నుంచి 'ప్రెడిక్టివ్ హెల్త్‌కేర్' విధానంలోకి అడుగుపెట్టామని మంత్రి చెప్పారు. అంటే.. వ్యాధి వచ్చాక వైద్యం చేయడం కంటే, అది రాకముందే గుర్తించేలా వ్యవస్థను మార్చామన్నారు. ప్రజల వద్దకే నేరుగా వెళ్లి 45 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నామని, దీనివల్ల వ్యాధులను ముందే గుర్తించి అవసరమైన మందులు పంపిణీ చేస్తున్నామని వివరించారు. అలాగే టెలిమెడిసిన్ ద్వారా రోగుల సందేహాలకు నిపుణులైన వైద్యులతో సమాధానాలు ఇప్పిస్తున్నట్లు తెలిపారు.
ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న మెరుగైన సేవల వల్ల ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం, సంతృప్తి పెరిగాయని.. అందుకే ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా పెరిగిందని సత్యకుమార్ అన్నారు. తమ ప్రభుత్వ పనితీరుకు ఆసుపత్రుల్లోని గణాంకాలే నిదర్శనమని చెప్పారు. 'స్వర్ణాంధ్ర–2047' లక్ష్య సాధనలో 'ఆరోగ్యాంధ్రప్రదేశ్' అత్యంత కీలక పాత్ర పోషిస్తోందని చెబుతూ.. ఈ మార్పునకు సహకరించిన వైద్య సిబ్బందికి, అధికారులకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు.. వేలాది ఉద్యోగాలు: మంత్రి టీజీ భరత్

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి టీజీ భరత్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని, వీటి ద్వారా వేలాది మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈరోజు కర్నూల్‌లో పర్యటించిన మంత్రి పలు కార్యక్రమాల్లో పాల్గొని మీడియాతో మాట్లాడారు.కర్నూల్‌లో నిర్వహించిన జాబ్‌మేళాలో 19 కంపెనీలు పాల్గొన్నాయని, మొత్తం 1,460 ఉద్యోగ అవకాశాలను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. ఒక వ్యక్తికి ఉద్యోగం లభిస్తే ఆ కుటుంబమంతా సంతోషంగా ఉంటుందని అన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జాబ్‌మేళాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు.రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో పెట్టుబడులను ఆకర్షించి ఉపాధి అవకాశాలను పెంచేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఓర్వకల్లుకు ఎన్నడూ లేనంతగా పరిశ్రమలు వస్తున్నాయని, రిలయన్స్, అగస్త్య సంస్థలను కర్నూలుకు తీసుకువచ్చామని వెల్లడించారు. జైరాజ్ ఇస్పాత్ స్టీల్ కంపెనీ మరో రూ.6 వేల కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు ఆలోచనలు అమలైతే ఆంధ్రప్రదేశ్ ప్రపంచస్థాయి అభివృద్ధి సాధిస్తుందని మంత్రి భరత్ విశ్వాసం వ్యక్తం చేశారు.

# భారత సైన్యానికి కొత్త చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్

- మొదటి పేజీ తరువాయి
ఒకటైన సుదర్శన్ చక్ర కార్ప్స్‌కు కమాండర్‌గా వ్యవహరించారు. ఢిల్లీ ప్రాంత జనరల్ ఆఫీసర్ ఇన్ కమాండింగ్‌గా కూడా పనిచేశారు. ఈ సమయంలో దేశీయ, అంతర్జాతీయ సైనిక కార్యక్రమాల సమన్వయం బాధ్యతలు నిర్వర్తించారు.సైన్యాన్ని ఆధునిక అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడంలో ధీరజ్ సేథ్ కీలక పాత్ర పోషించారు. సైనిక సామర్థ్యాల పెంపు, భవిష్యత్ వ్యూహాల రూపకల్పన, దళాల పునర్వ్యవస్థీకరణ వంటి అంశాల్లో ఆయన సేవలు విశేష గుర్తింపు పొందాయి. ధీరజ్ సేథ్ హయ్యర్ కమాండ్ కోర్స్, నేషనల్ డిఫెన్స్ కాలేజ్‌లో ఉన్నత శిక్షణ పొందారు. ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్‌లో నిర్వహించే ప్రతిష్ఠాత్మక కమాండ్ అండ్ స్టాఫ్ కోర్స్‌లో కూడా పాల్గొన్నారు. సమకాలీన సైనిక వ్యూహాలపై ఆయనకు విస్తృత అవగాహన ఉందని అధికారులు చెబుతున్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం.. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వాంగ్మూలం నమోదు

- మొదటి పేజీ తరువాయి
ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో సిట్ విస్తృత స్థాయిలో దర్యాప్తు చేపడుతోంది. ప్రాథమిక విచారణలో అప్పట్లో ఖమ్మం రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన తుమ్మల నాగేశ్వరరావు కూడా ట్యాపింగ్‌కు గురైన వారిలో ఒకరని గుర్తించినట్లు సమాచారం. కొందరు ఇంటెలిజెన్స్ అధికారులు ఆయన ఫోన్‌ను అక్రమంగా ట్యాప్ చేయడంతో పాటు, ఆయన కదలికలను ట్రాక్ చేసి వ్యక్తిగత సంభాషణలను పర్యవేక్షించినట్లు దర్యాప్తులో వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. మంత్రి నివాసంలో జరిగిన విచారణ సందర్భంగా ఆయన ఫోన్ కాల్స్, లొకేషన్ డేటా, వ్యక్తిగత కమ్యూనికేషన్లపై జరిగిన నిఘాకు సంబంధించి సిట్ అధికారులు పలు వివరాలు సేకరించారు. బాధితుడిగా తుమ్మల ఇచ్చిన వాంగ్మూలం కేసు దర్యాప్తులో కీలక ఆధారంగా మారే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.ఇప్పటికే ఈ కేసులో గత ప్రభుత్వానికి చెందిన పలువురు సీనియర్ అధికారులు న్యాయపరమైన కస్టడీలో ఉన్నారు. తాజాగా మంత్రి తుమ్మల వాంగ్మూలం నమోదు కావడంతో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మరోసారి రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. సిట్ దర్యాప్తు వేగవంతం కావడంతో రానున్న రోజుల్లో మరికొంతమంది రాజకీయ నాయకులు, అధికారులకు నోటీసులు జారీ అయ్యే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

# ఆర్‌జీయూకేటీలకు 4,040 విద్యార్థులు ఎంపిక

- మొదటి పేజీ తరువాయి
ఇందులో 96 శాతం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులే ఉన్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారికి నాణ్యమైన ఉన్నత విద్యను అందించాలనే ఆర్‌జీయూకేటీ ఆశయానికి నిదర్శనంగా ఈ ఎంపిక గర్వకారణమన్నారు

# పెట్టుబడులే లక్ష్యం.. నేడు సింగపూర్‌కు సీఎం చంద్రబాబు

- మొదటి పేజీ తరువాయి
వాణిజ్య రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు గూగుల్ క్లౌడ్, జీఐసీ, వైసీహెచ్ లాజిస్టిక్స్ వంటి దిగ్గజ సంస్థల ప్రతినిధులతో చంద్రబాబు భేటీ కానున్నారు. స్టార్టప్ వెంచర్ క్యాపిటలిస్టులతో జరిగే రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొంటారు. నేషనల్ యూనివర్శిటీ ఆఫ్ సింగపూర్ అధ్యక్షుడితోనూ సమావేశమై విద్యా రంగంలో భాగస్వామ్యంపై చర్చిస్తారు. ఈ పర్యటనలో అత్యంత కీలకమైన అంశం రాజధాని అమరావతి. రాజధాని మాస్టర్ ప్లాన్ రూపొందించిన సుర్బానా జురాంగ్ సంస్థ ప్రతినిధులతో అమరావతి ప్రణాళికపై ప్రత్యేకంగా సమావేశం కానున్నారు.పర్యటనలో భాగంగా 'వరల్డ్ సిటీస్ సమ్మిట్'లో పాల్గొని ప్రసంగిస్తారు. అనంతరం 2026లో విశాఖలో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు సన్నాహకంగా ఏర్పాటు చేసిన బిజినెస్ రోడ్‌షోలో చంద్రబాబు పాల్గొంటారు. పర్యటన ముగించుకుని 16న రాత్రి 10 గంటలకు ఆయన తిరిగి స్వదేశానికి రానున్నారు. ముఖ్యమంత్రి వెంట పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్, సీఆర్డీఏ అధికారుల బృందం కూడా ఈ పర్యటనలో పాల్గొంటుంది.

# యుద్ధాన్ని ముగించేందుకు సమయం ఆసన్నమైంది మిత్రమా!

- మొదటి పేజీ తరువాయి
అమెరికా, ఇరాన్ మధ్య చర్చలు తుది దశకు చేరుకున్నాయని ఇరు దేశాల అధికారులు చెబుతున్నారు. గతంలో ఇరాన్‌లో పాలన మార్పే లక్ష్యమని వాదించిన నెతన్యాహు.. ఇప్పుడు ట్రంప్ ముందుకు తీసుకెళుతున్న ఒప్పందాన్ని అడ్డుకోలేమనే అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఇరాన్ అణు కార్యక్రమంపై ఇజ్రాయెల్ ఆందోళనలను ఒప్పందంలో పరిగణనలోకి తీసుకుంటారని ట్రంప్‌పై తనకు నమ్మకం ఉందని ఆయన చెప్పినట్లు అధికారులు వెల్లడించారు.అయితే ప్రతిపాదిత ఒప్పందంపై ఇజ్రాయెల్ పూర్తిగా సంతృప్తిగా లేదని సమాచారం. ఆంక్షల సడలింపుతో ఇరాన్ చమురు విక్రయాలు పెంచుకొని ఆర్థికంగా బలపడొచ్చని, అదే సమయంలో అణు కార్యక్రమాన్ని పూర్తిగా నిలిపివేయకపోవచ్చని ఇజ్రాయెల్ వర్గాలు భావిస్తున్నాయి. ఆ దేశ రక్షణ మంత్రి కాట్జ్ మాట్లాడుతూ.. అమెరికా తన ప్రయోజనాల దృష్ట్యా ఒప్పందం కుదుర్చుకుంటున్నప్పటికీ ఇరాన్ అణు కార్యక్రమం, క్షిపణులు, అనుబంధ తీవ్రవాద సంస్థల విషయంలో తమ భద్రతా ఆందోళనలు కాపాడాలని ఆశిస్తున్నామని చెప్పారు.
న్యూయార్క్ టైమ్స్ కథనం ప్రకారం అమెరికా–ఇరాన్ మధ్య త్వరలో ఓ అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదిరే అవకాశం ఉంది. ఇందులో 60 రోజుల కాల్పుల విరమణ, ఇరాన్‌పై ఆంక్షల సడలింపు, అణు కార్యక్రమంపై తదుపరి చర్చలకు మార్గం సుగమం చేసే అంశాలు ఉండనున్నాయి. అలాగే హర్మూజ్ జలసంధిని తిరిగి పూర్తిగా తెరవడం, ఇరాన్ పోర్టులపై అమెరికా దిగ్బంధనాన్ని ఎత్తివేయడం వంటి ప్రతిపాదనలు ఉన్నట్లు తెలుస్తోంది.

# బీజేపీ ఓటు చోరీ మాత్రమే కాదు.. సీటు చోరీ కూడా చేస్తోంది

- మొదటి పేజీ తరువాయి
బూత్ స్థాయిలో ప్రతి కార్యకర్త అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. జూన్ 25 నుంచి ప్రారంభమయ్యే ఇంటింటి సర్వేలో కాంగ్రెస్ శ్రేణులు చురుకుగా పాల్గొనాలన్నారు. ఓటర్ల జాబితాలో లోపాలు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే ప్రమాదం ఉందన్నారు.

# రెండేళ్లలోనే కూటమి ప్రభుత్వం విఫలం

- మొదటి పేజీ తరువాయి
బొత్స పేర్కొన్నారు. రైతులకు తమ పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని, జొన్న, మామిడి పంటలకు కూడా కనీస మద్దతు ధర అందడం లేదని అన్నారు. ఆక్వా రంగం పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయిందని ఆరోపించారు.విద్యాశాఖను మంత్రి నారా లోకేశ్‌కు అభివృద్ధి కోసం అప్పగించారా లేక దాన్ని నిర్వీర్యం చేయడానికా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన సూపర్ సిక్స్, సూపర్ సెవన్ హామీలు ఏమయ్యాయని నిలదీశారు. ఆడబిడ్డ నిధి పథకాన్ని ప్రభుత్వం దాదాపు పక్కన పెట్టిందని విమర్శించారు.ఇటీవల తిరుపతిలో నిర్వహించిన సభను విజయోత్సవ సభగా కాకుండా 'వెన్నుపోటు ఉత్సవం'గా అభివర్ణించిన బొత్స, టీడీపీని 'వెన్నుపోటు పార్టీ'గా పేర్కొన్నారు. రైతులు యూరియా కోసం ఒడిశా నుంచి ఒక్కో బస్తా రూ.600 చొప్పున కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని ఆరోపించారు.ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చని ఈ ప్రభుత్వానికి ఒక్క నిమిషం కూడా అధికారంలో కొనసాగే హక్కు లేదని బొత్స వ్యాఖ్యానించారు. 'రెండేళ్ల వెన్నుపోటు' ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

# అగ్రవర్ణ పేద కుటుంబం 2డేళ్లయినా పరిష్కారం దొరకని భూసమస్యకోసం ప్రదక్షణం



నాయుడుపేట, పెన్ పవర్, జూన్ 13 కూటమి ప్రభుత్వం అవినీతి రహిత పాలనకే ప్రాధాన్యం అన్నారు. సమస్యలు పరిష్కారానికి నిర్దేశ కాలవ్యవధి లోపు పరిష్కారం చూపుతామని అంటున్న జిల్లా అధికారుల మాటల్లో కార్యరూపం కనిపించడం లేదు. పి జి ఆర్ ఎస్ పథకానికి సార్ధ కథ కనిపించడం లేదు. జిల్లా కలెక్టర్ ఆదేశాలకు ప్రాధాన్యత ఇచ్చి తాసిల్దార్లు పేదవారి భూ సమస్యలు పరిష్కరించక సమస్యలున్న వారంతా ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టే తిరిగి...తిరిగి, విసిగి వేసారి పోతున్నారు. ఇలాంటి సంఘటనే నాయుడుపేట మండల పరిధిలోని భీమవరం గ్రామంలో అగ్రవర్ణ నిరుపేదలకు జరిగిన సంఘటనే నిదర్శనంగా కనిపిస్తోంది. వివరాల్లోకి వెళితే భీమవరం గ్రామంలోని కాటంరెడ్డి. బలరామరెడ్డికి ఆ గ్రామ రెవిన్యూ లోని లంక పొలం సర్వే నంబర్ 91-2ఐ1లో 4-31 సెంట్లు పొలం ఉండేది. ఆయన కుటుంబ అవసరాల నిమిత్తం 2002లో వారి సమీప బంధువులైన....... వారికి 4-04 సెంట్లు భూమిని విక్రయం చేసుకున్నారు మిగిలిన 27 సెంట్లు భూమి మెరకగా ఉన్న ప్రాంతంలో ఇల్లు నిర్మించుకుని కొంతకాలం గడిపారు. వారి ఆరోగ్య పరిస్థితి సరిలేని కారణంగా అక్కడ నుండి నాయుడుపేటలో జీవనం సాగిస్తున్నారు. కొంతకాలం ఆ వృద్ధ దంపతులు ఆ పొలం వైపు వెళ్లకపోవడంతో భూమిని కొనుగోలు చేసిన వారి బంధువులే ఇల్లు నిర్మించుకుని నివాసమున్న మెరక ప్రాంతాన్ని జెసిబి తో మట్టిని తరలించి ఆ భూమిని కూడా స్వాధీనం చేసుకున్నారని బాధితుని ఆరోపణగా ఉంది. అగ్రవర్ణ నిరుపేద దంపతులు వారు అన్యాక్రాంతం చేసుకుని 27 సెంట్లు భూమిని ఖాళీ చేయాలని పలుమార్లు ప్రయత్నించిన భూమి కొన్న యజమానులు ససేమిరా అంటూ వారి భూమిని వదలక పోవడంతో సర్వే చేసి భూమి చూపించమని 2025, ఏప్రిల్, ఆగస్టు మాసాల్లో జిల్లా కార్యాలయంలో జరిగిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. దీనిపై సరియైన న్యాయం చేయాలని నాయుడుపేట తాసిల్దార్ కు పంపించడం జరిగింది. కానీ ఆ రెవెన్యూ కార్యాలయంలో తాసిల్దార్, సర్వేయర్, వీఆర్వోలు చుట్టూ తిరిగినా నేటికీ న్యాయం చేయలేదు. పొలం కొనుగోలు చేసిన వారికి అధికారులు అమ్ముడుపోయి నిరుపేదల మైన మాకు తీవ్ర అన్యాయం చేశారని, నేటికీ 27 సెంట్లు భూమిని చూపించనేలేదని వాపోతున్నారు. తాసిల్దార్, మండల సర్వేయర్, డిప్యూటీ సర్వేయర్, వీఆర్వోలు సర్వే చేసి చూపిస్తామని ఓ పర్యాయం ఆ భూమి వద్దకు వెళ్లిన పలు రకాల మాటలతో సరిపెట్టుకుని భూమి చూపించకనే వెళ్లిపోయారు. అప్పటినుండి ఇప్పటివరకు రెండేళ్లుగా ఆ వృద్ధుడు న్యాయం జరుగుతుందన్న ఆశతో అధికారులనే కాకుండా, ప్రజా ప్రతిని దుల వద్దకు వెళ్లి న్యాయం చేయమని అభ్యర్థించిన ఎవరు కనికరించి మాకు న్యాయం చేయలేదని నిరాశ చెందారు. జిల్లాఅధికారులు చెప్పేదానికి మండల స్థాయి అధికారులు చేసేదానికి ఏమాత్రం పిజిఆర్ఎస్ ఫిర్యాదులకు ఏమాత్రం న్యాయం జరగడం లేదని, అలాంటప్పుడు పీజీ ఆర్ఎస్ ఫిర్యాదులు స్వీకరించడం ఎందుకని ప్రశ్నించారు. అధికారులు పట్టించుకోక, ప్రజా పాలకులు న్యాయం చేయకపోవడం నిరుపేదలకు శాపం గా ఉందని అన్నారు. రెవెన్యూ అధికారులు న్యాయం చేయలేకపోవడానికి కారణం ప్రజా ప్రతినిధుల ఒత్తిడిలా, భూమి కొనుగోలు చేసిన యజమానుల ఆశ చూపే లంచాలకు పాల్పడి న్యాయం చేయలేకపోతున్నారన్నారు. రెవిన్యూ అధికారులు రెండేళ్లుగా పరిష్కారం కాని చిన్నపాటి భూ సమస్య పరిష్కరించలేక పోతే మరణమే శరణంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న సమస్యలకు కూడా అధికారులు సకాలంలో స్పందించి న్యాయం చేయకపోకపోవడం కూటమి ప్రభుత్వంపై ప్రభావం చూపుతోంది. అధికారులు స్పందించి న్యాయం చేస్తారా, గాలికి వదిలేసి నిండు ప్రాణాలను బలి తీసుకుంటారా వేచి చూడాల్సిందే.

# నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంది




గుంటూరు, పెన్ పవర్, జూన్, 13, ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం విజయవంతంగా 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశ ప్రజలకు, బీజేపీ కార్యకర్తలకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. గత 12 సంవత్సరాలు కేవలం ఒక ప్రభుత్వ పాలన మాత్రమే కాదు. అవి దేశ ప్రజల విశ్వాసానికి, సుపరిపాలనకు, పారదర్శకతకు, అభివృద్ధికి మరియు ప్రపంచ వేదికపై భారతదేశం పెరిగిన ప్రతిష్ఠకు ప్రతీకగా నిలిచాయి. 2014లో దేశ ప్రజలు నరేంద్ర మోదీ కి అవకాశం కల్పించారు. 2019లో మరింత భారీ మెజారిటీతో ఆశీర్వదించారు. 2024లో వరుసగా మూడోసారి దేశ ప్రధానమంత్రిగా బాధ్యతలు అప్పగించారు. ఇది కేవలం ఎన్నికల విజయం కాదు; మోదీ నాయకత్వంపై దేశ ప్రజలు ఉంచిన అపారమైన విశ్వాసానికి నిదర్శనం. మోదీ ప్రభుత్వం ఎల్లప్పుడూ పేదలు, రైతులు, యువత మరియు మహిళల సంక్షేమానికే ప్రాధాన్యత ఇచ్చింది. మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆయన సంతకం చేసిన తొలి ఫైలు పీఎం కిసాన్ నిధుల విడుదలకు సంబంధించినదే కావడం రైతుల పట్ల ఆయనకున్న నిబద్ధతను చాటుతోంది. కోట్లాది రైతులకు ప్రత్యక్ష ఆర్థిక సహాయం, మహిళల సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలుగా కొనసాగుతున్నాయి. 2014లో ప్రపంచంలో పదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్, నేడు ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదగడం మోదీ దూరదృష్టికి నిదర్శనం. త్వరలోనే ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించబోతోంది. నేడు ప్రపంచం భారత్‌ను అవకాశాల దేశంగా మాత్రమే కాకుండా పరిష్కారాలను అందించే దేశంగా చూస్తోంది. మౌలిక సదుపాయాల రంగంలో దేశం విప్లవాత్మక మార్పులను చూసింది. జాతీయ రహదారుల విస్తరణ, విమానాశ్రయాల అభివృద్ధి, వందేభారత్ రైళ్లు, మెట్రో నెట్‌వర్క్ విస్తరణ ద్వారా దేశం అభివృద్ధి కొత్త దశలోకి ప్రవేశించింది. డిజిటల్ ఇండియా కార్యక్రమం ద్వారా యూపీఐ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచింది. జనధన్-ఆధార్-మొబైల్ వ్యవస్థ ద్వారా కోట్లాది రూపాయలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి చేరడం వల్ల అవినీతికి అడ్డుకట్ట పడింది. రక్షణ రంగంలో భారత్ స్వావలంబన దిశగా ముందుకు సాగుతోంది. ఒకప్పుడు రక్షణ సామగ్రిని దిగుమతి చేసుకునే దేశం, నేడు వందకు పైగా దేశాలకు రక్షణ ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది. దేశ భద్రత విషయంలో మోదీ ప్రభుత్వం ఎప్పుడూ రాజీ పడలేదు. భారతీయ సంస్కృతి, వారసత్వ పునరుజ్జీవనానికి కూడా మోదీ ప్రభుత్వం విశేష కృషి చేసింది. అయోధ్యలో శ్రీరామ మందిర నిర్మాణం, కాశీ విశ్వనాథ్ కారిడార్, మహాకాళ్ లోక్, కేదార్‌నాథ్ పునర్నిర్మాణం వంటి కార్యక్రమాలు భారతీయ ఆత్మను ప్రపంచానికి చాటిచెప్పాయి. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కూడా కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం పూర్తి మద్దతు అందిస్తోంది. అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, జాతీయ రహదారులు, రైల్వేలు, పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం విశేష సహకారం అందిస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం కలిసి డబుల్ ఇంజిన్ సర్కార్‌గా రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాయ ఈ సందర్భంగా దేశానికి సమర్థ నాయకత్వం అందిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి, దేశ ప్రజలకు, బీజేపీ కార్యకర్తలకు మరోసారి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను బిజెపి జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన ఈ విలేఖరుల సమావేశంలో జాతీయ స్పైసెస్ బోర్డ్ సభ్యులు కొత్తూరి వెంకట సుబ్బారావు రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు యడ్లపాటి స్వరూపరాణి ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బజరంగ్ రామకృష్ణ జిల్లా కార్యదర్శి క్రిష్టిపాటి నారాయణరెడ్డి ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు ధారా అంబేద్కర్ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు షేక్ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు

# ఉచిత కంటి వైద్య శిబిరాలనుసద్వినియోగం చేసుకోవాలి జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ



విజయవాడ, పెన్ పవర్, జూన్, 13, ప్రజలు కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, శుక్లాల (ముత్యబిందు) కారణంగా చూపు మందగించిన వారు ఆలస్యం చేయకుండా శస్త్రచికిత్స చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సూచించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో శంకర నేత్రాలయ వైద్యులు డా. మాధవ్, డా. అపర్ణల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత కంటి ఆపరేషన్ శిబిరానికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో విడుదల చేశారు. మనిషికి ప్రకృతి ప్రసాదించిన అత్యంత విలువైన వరాల్లో కనుచూపు ఒకటని అన్నారు. కంటి చూపు ద్వారా మనం ప్రపంచాన్ని దర్శించగలుగుతామని, విద్యాభ్యాసం, ఉపాధి, దైనందిన కార్యకలాపాలు, సామాజిక జీవనం సజావుగా సాగేందుకు చూపు ఎంతో అవసరమని పేర్కొన్నారు. కంటి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల వ్యక్తిగతంగా, కుటుంబపరంగా అనేక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. వయస్సు పెరుగుతున్న కొద్దీ చాలామందిలో శుక్లాలు (ముత్యబిందు) ఏర్పడడం సహజమని తెలిపారు. శుక్లాలు వచ్చినప్పుడు వస్తువులు మసకగా కనిపించడం, చదవడంలో ఇబ్బంది కలగడం, వెలుతురు పట్ల అసౌకర్యం, రాత్రివేళల్లో సరిగా కనిపించకపోవడం, రంగులను స్పష్టంగా గుర్తించలేకపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయని వివరించారు. ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తే చూపు మరింత తగ్గిపోయి సాధారణ జీవనం కూడా కష్టతరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. శుక్లాలకు ప్రస్తుతం అత్యంత సురక్షితమైన, సమర్థవంతమైన చికిత్స శస్త్రచికిత్సేనని కలెక్టర్ తెలిపారు. శస్త్రచికిత్స ద్వారా మసకబారిన కంటి లెన్స్‌ను తొలగించి, దాని స్థానంలో కృత్రిమ లెన్స్‌ను అమర్చడం వల్ల చూపు గణనీయంగా మెరుగుపడుతుందని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కంటి పరీక్షలు, శుక్లాల శస్త్రచికిత్సలు నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో అందుబాటులో ఉన్నాయని, కంటి చూపు సమస్యలు ఉన్న వారు సమీప ప్రభుత్వ వైద్యశాలను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ కోరారు. శిభిరానికి సంబంధించి ఇతర వివరాలకు 9440029999 నంబర్ నందు సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ డా. వెలగ జోషి, సెక్రటరీ సీహెచ్. చిట్టిబాబు, సభ్యులు బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారి అదృశ్యం ఘటనపై డిప్యూటీ సిఎం ఆరా

అమరావతి బ్యూరో :పెన్ పవర్,జూన్ 13 కాకినాడ జిల్లా, తుని మండల పరిధిలోని సీహెచ్ అగ్రహారంలో వారం రోజుల క్రితం అదృశ్యమైన చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీ త్వరితగతిన కనుగొనేందుకు మరిన్ని బృందాలను రంగంలోకి దించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచించారు. ప్రస్తుతం గాలింపు చర్యల్లో పాల్గొంటున్న పోలీసు, ఎస్డీఆర్ఎఫ్ బృందాలతోపాటు ఎన్డీఆర్ఎఫ్ బృందాల సేవలు కూడా వినిగియోగించుకోవాలని తెలిపారు. దట్టమైన అడవుల్లోకి సైతం వెళ్లగలిగే అటవీశాఖ నైట్ వాచర్స్, బేస్ క్యాంప్ వాచర్స్ , ఎక్స్ పర్ట్స్ సహాయం తీసుకుని పరిసర అటవీ ప్రాంతాల్లో జల్లెడ పట్టాలని చెప్పారు. చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం ఘటనపై కాకినాడ జిల్లా ఎస్పీతో ఫోన్ లో శనివారం మరోసారి సమీక్షించారు. ఇప్పటికే పలుమార్లు ఈ అంశంపై పోలీసు ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి మాట్లాడారు. బాలిక ఆచూకి కనుగొనేందుకు ఇప్పటికే 400 మందికిపైగా సిబ్బంది గాలింపు చర్యల్లో పాల్గొంటున్నట్టు, అత్యాధునిక డ్రోన్లతో అణువణువు జల్లెడ పడుతున్నట్టు కాకినాడ ఎస్పీ వివరించారు. చిన్నారి ఇంటి పరిసరాల్లో 38 సీసీ కెమెరాల్లో ఫుటేజీని పరిశీలించినట్టు తెలిపారు.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా। తిరుపతి జిల్లా। చిత్తూరు జిల్లా। వై.ఎస్.ఆర్. కడప జిల్లా।


# కాలువల అభివృద్ధితో రైతాంగానికి ఊరట



పెడన, పెన్ పవర్, జూన్ 13 బంటుమిల్లి మండలం డీసీ పరిధిలోని పంట కాలువలను పూర్తిస్థాయిలో శుభ్రం చేయించి రైతుల ప్రశంసలు అందుకుంటున్నారు డీసీ చైర్మన్ బొర్రా కాశీ. రైతులకు సాగునీరు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేరేలా కాలువల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తూ నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారు. పంట కాలువల్లో పెరిగే గుర్రపు డెక్క, తూడు, నాచు మొక్కలను గుర్తించి వెంటనే తొలగించేలా చర్యలు తీసుకుంటున్నారు. కాలువల్లో కలుపు మొక్కలు విస్తరించకుండా కలుపు మందును పిచికారీ చేయిస్తూ నీటి ప్రవాహానికి ఆటంకాలు తొలగిస్తున్నారు. కాలువల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఎక్కడైనా స

# మానసిక ఒత్తిడి నుంచి విముక్తి పొందాలి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్





బాపట్ల:( పెన్ పవర్ ) జూన్13 పర్చూరు మండలం అద్దంకి నాంచారమ్మ దేవస్థానం ఆవరణలో యోగాంధ్ర కార్యక్రమంజరిగింది. యోగాంధ్రకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ యోగాసనాలు వేసి స్ఫూర్తిగా నిలిచారు. దీంతో ప్రజలంతా ఆసక్తిగా యోగాసనాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలతోపాటు మండల, జిల్లా స్థాయి అధికారులు యోగాసనాలు వేశారు. త్రికోణ ఆసనం, భద్రాసనం, వజ్రాసనం, శశాంక ఆసనం, ఉత్తానం, మండక ఆసనం, వక్రాసనం, మకరాసనం, భుజంగాసనం, సేతుభల్లాసనం, ఉత్తానం, పాదాసనం, పవన ముక్తాసనం, పద్మాసనం, ప్రాణాయం, నాడీ శోధన ఆసనం, శీతలి ప్రాణాయం, బ్రమణి ప్రాణాయం, షణ్ముఖ ముద్ర వంటి తదితర ఆసనాలు వేసి యోగాతో సంకల్ప ప్రతిజ్ఞ చేశారు. సుఖసంతోషాలతో ప్రజలు ఆరోగ్యంగా ఉండడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ వినోద్ కుమార్ చెప్పారు. భారతదేశంలో పూర్వకాలం నుంచి యోగాకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. సర్వరోగ నివారిణిలా యోగా పనిచేస్తుందని, స్వదేశం, ఇతర దేశాల్లోనూ ఎన్నోసార్లు ధ్రువీకరణ పొందిన విషయాన్ని గుర్తు చేశారు. మీ ఆరోగ్యం పదిలంగా ఉండాలంటే యోగ మీ జీవితంలో ఒక భాగం కావాలన్నారు. ఎలాంటి ఖర్చు లేకుండా మీ శరీరాన్ని, హృదయాన్ని నియంత్రించే సాధనంలా యోగా పనిచేస్తుందన్నారు. ఇందు కొరకే యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. గత కొన్నేళు ్లగా ఒక గంట ధ్యానం చేస్తాను, అందులో భాగంగానే యోగ సాధన చేస్తుంటానని కలెక్టర్ తన అనుభవాలను పంచుకున్నారు. అలా చేయడం ద్వారా మన ఆలోచనల్లో స్పష్టత, ఆరోగ్యం, మన మనసు మన అధీనంలో ఉంచుకోగలమన్నారు. నాకు ఊబకాయం రాకుండా ఆరోగ్యంగా ఉన్నానంటే ఇదే నా ఆరోగ్య రహస్యం అని వివరించారు. పర్యాటక రంగం అభివృద్ధితో బాపట్ల జిల్లా రూపురేఖలు మారుతున్నాయని కలెక్టర్ చెప్పారు. అన్ని శాఖల అధికారుల సమష్టి కృషితోనే సాధ్యమైందన్నారు. గత రెండు నెలల నుంచి పర్యాటకల సంఖ్య మరింత పెరుగుతోందన్నారు. పర్యాటకంగా అభివృద్ధి చెందితే వాటిని ఆధారం చేసుకుని పలు రంగాలు అభివృద్ధి చెందుతాయన్నారు. భూముల విలువ పెరగడమే గాకుండా రెస్టారెంట్ లు, హోటల్లు మరింత అధికం కానున్నాయని చెప్పారు. దీంతో జిల్లా ప్రజల తలసరి ఆదాయం పెరుగుతుందని ఆయన వివరించారు. యోగాతో ఏకాగ్రత పెరగడం, ఏదైనా సాధించగలమనే ఆత్మస్థైర్యం, పట్టుదల పెరుగుతుందని బాపట్ల ఆర్డిఓ ఏ.హరికుమార్ చెప్పారు. ఉన్నత విలువలతో సాగేలా యోగ మార్గనిర్దేశం చేస్తుందన్నారు. అలాగే లక్ష్య సాధన దిశగా నడిపిస్తుందని, శాంతి సామరస్యాలతో మెలగవచ్చని వివరించారు. భారత సనాతన ధర్మంలో యోగ ఒక భాగమని పర్చూరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఉప కలెక్టర్ లవన్న తెలిపారు. మన మనసు ప్రశాంతంగా ఉంటే సమాజంలో ఆరోగ్యకరమైన వాతావరణం ఉంటుందన్నారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉంటారన్నారు. మానసిక ఒత్తిడి నుంచి ప్రజలు బయటికి రావాలంటే యోగాసనాలు ఉత్తమమైన మార్గమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఎస్ విజయమ్మ తెలిపారు. ప్రతిరోజు 45 నిమిషాల పాటు యోగా చేస్తే మీ ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యోగాంధ్ర జిల్లా నోడల్ అధికారి డాక్టర్ డి.చంద్రశేఖర్, తహసిల్దార్ బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఆయుష్ ప్రాథమిక వైద్యశాల సేవలు విస్తృతం చేయాలి జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్.వి





బాపట్ల:( పెన్ పవర్ ) జూన్13 పర్చూరు మండలం ఉప్పుటూరు గ్రామంలోని ఆయూష్ వైద్యశాలను కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పర్చూరులోని అద్దంకి నాంచారమ్మ దేవస్థానం అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం కలెక్టర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామీణ ప్రజలకు భారతదేశ ప్రాచీన కాలం నుంచి ప్రాచుర్యం పొందిన ఆయూష్ వైద్య సేవలు అందించాలని కలెక్టర్ చెప్పారు. స్వర్ణ గ్రామ సచివాలయంలో ఒక చిన్నగదిలోనే ఆయుష్ శాఖ వైద్యశాల నడపడం ఏమిటని స్థానిక అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. శిథిలమై తొలగించిన భవన స్థలంలోనే తిరిగి ఆయుష్ వైద్యశాల నిర్మించాలని గ్రామస్తులు కోరడంతో ఆ స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఆ గ్రామంలోని ప్రజలు వైద్య సేవలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా స్థానిక ప్రాంతీయ వైద్యశాలలోనే ఆయుష్ వైద్యం అందించాలని కలెక్టర్ ను కోరారు. స్పందించిన కలెక్టర్ తక్షణమే వైద్యశాలను మార్చాలని నియోజకవర్గ ఇన్చార్జి అధికారిని ఆదేశించారు. ఆయూష్ వైద్యశాల భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఆయన వెంట ఆర్డిఓ ఏ హరికుమార్, ఆయూష్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ డి.చంద్రశేఖర్, వైద్య, ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఎస్.విజయమ్మ, తదితరులు ఉన్నారు.

# చిలకలూరిపేటలో జూన్ 16న మెగా జాబ్ మేళా40 కంపెనీల్లో 2,000 ఉద్యోగ అవకాశాలు: తేళ్ల సుబ్బారావు

చిలకలూరిపేట , పెన్ పవర్, జూన్ 13 : చిలకలూరిపేట : పట్టణంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ నెల 16వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు చిలకలూరిపేట విద్యాసంఘం చైర్మన్ తేళ్ల సుబ్బారావు తెలిపారు. ప్రత్తిపాటి ఫౌండేషన్, ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో, మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మార్గదర్శకత్వంలో, ప్రత్తిపాటి శరత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పట్టణంలోని ప్రత్తిపాటి గార్డెన్స్‌లో ఈ నెల 16వ తేదీ (మంగళవారం) ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాబ్ మేళా కొనసాగుతుందని తెలిపారు. ఈ మేళాలో సుమారు 40 ప్రముఖ కంపెనీలు పాల్గొంటుండగా, దాదాపు 2,000 ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ తదితర విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభకు తగిన ఉద్యోగాలను పొందాలని కోరారు.నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం ప్రోత్సహిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ప్రత్తిపాటి శరత్‌లకు ఈ సందర్భంగా తేళ్ల సుబ్బారావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. యువత భవిష్యత్తు నిర్మాణానికి ఉపాధి కల్పన కీలకమని,



ఈ జాబ్ మేళా ద్వారా వందలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరిస్తున్న ప్రత్తిపాటి ఫౌండేషన్ కన్వీనర్ కంచర్ల శ్రీనివాసరావు, నియోజకవర్గ సమన్వయకర్త సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ కరిముల్లా తదితర ప్రముఖులతో పాటు వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, ప్రజాప్రతినిధులు, సామాజికవేత్తలు సహకరిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ విద్యార్హతల ధ్రువపత్రాలు, బయోడేటాతో తప్పనిసరిగా హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తేళ్ల సుబ్బారావు పిలుపునిచ్చారు.

# బాపట్లలో ఇతర రాష్ట్రాల వ్యాపారులపై స్థానికుల్లో అనుమానాలు

బాపట్ల:(పెన్ పవర్) జూన్ 13 బాపట్ల పట్టణంలో వ్యాపార నిమిత్తం ఇతర రాష్ట్రాలకు చెందిన కొందరు వ్యక్తులు పెద్ద సంఖ్యలో సంచరిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. వీరిలో కొందరు లాడ్జిల్లో బస చేస్తుండగా, మరికొందరు వివిధ వార్డుల్లో అద్దె ఇళ్లలో నివాసం ఉంటూ గాజులు, ప్లాస్టిక్ వస్తువులు, బొట్టు బిళ్ళలు తదితర సామగ్రిని విక్రయిస్తున్నట్లు సమాచారం. వీరు ప్రధానంగా హిందీ భాషలో మాట్లాడుతుండటంతో స్థానికులకు వారితో సంభాషణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వాబాపట్లలో ఇతర రాష్ట్రాల వ్యాపారులపై స్థానికుల్లో అనుమానాలురి వివరాలపై స్పష్టత లేకపోవడం వల్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖ అధికారులు, పోలీసులు వారి గుర్తింపు పత్రాలు, నివాస వివరాలు, వ్యాపార అనుమతులు తదితర అంశాలను పరిశీలించి అవసరమైన సమాచారాన్ని సేకరించాలని స్థానికులు కోరుతున్నారు. అయితే కేవలం ఇతర రాష్ట్రాలకు చెందినవారిగా లేదా హిందీ మాట్లాడుతున్నారనే కారణంతో ఎవరిపైనా అనుమానాలు వ్యక్తం చేయకుండా, చట్టబద్ధమైన విధానంలోనే



అధికారులు విచారణ చేపట్టాలని కూడా సూచిస్తున్నారు.

# యోగాతో మానసిక ప్రశాంతత, సైకిలింగ్‌తో పర్యావరణ పరిరక్షణ

బాపట్ల :( పెన్ పవర్) జూన్ 13బాపట్లలో అంతర్జాతీయ యోగా దినోత్సవం--2026 పురస్కరించుకుని బాపట్ల పట్టణంలోని స్థానిక మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో బుధవారం యోగాంధ్ర కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి తరలివచ్చిన యోగా సాధకులు, విద్యార్థులతో ఇండోర్ స్టేడియం కిక్కిరిసిపోయింది. ఈ వేడుకలకు బాపట్ల జిల్లా రెవిన్యూ అధికారి (డీఆర్ఓ) జి. గంగాధర్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. అనంతరం ఆయన స్వయంగా వేదికపై యోగాసనాలు వేసి అందరిలోనూ సరికొత్త ఉత్సాహం నింపారు ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్ మాట్లాడుతూ యోగా అనేది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని, అది ఆరోగ్యకరమైన జీవనశైలికి, ఆత్మపరిశీలనకు ఒక ఉత్తమ మార్గమని స్పష్టం చేశారు. నేటి ఆధునిక ఉరుకుల పరుగుల జీవితంలో మానసిక ఒత్తిడి, ఆందోళన




సర్వసాధారణమైపోయాయని, వాటిని దూరం చేసుకుని ప్రశాంతతను పొందడానికి, ఏకాగ్రతను పెంచుకోవడానికి యోగా ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. అన్ని వయస్సుల వారు, ముఖ్యంగా యువత మరియు విద్య

# ఎస్ఐఆర్ మ్యాపింగ్ పనులను పరిశీలించిన ఎమ్మార్వో షేక్ సలీమా





బాపట్ల:(పెన్ పవర్) జూన్13 బాపట్ల మండల పరిధిలోని వేదుళ్లపల్లి, స్టువర్టుపురం గ్రామాల పరిధిలో ఉన్న పోలింగ్ స్టేషన్లు నెం.31, 36లో జరుగుతున్న ఎస్ఐఆర్ మ్యాపింగ్ పనుల పురోగతిని బాపట్ల ఎమ్మార్వో షేక్ సలీమా పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పరిశీలన కార్యక్రమంలో సంబంధిత బీఎల్‌వోలు (దీూాలు), సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. మ్యాపింగ్ ప్రక్రియ అమలు తీరును, వివరాల నమోదు విధానాన్ని ఎమ్మార్వో సమీక్షించారు. ఎన్నికల నిర్వహణలో ఖచ్చితత్వం, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని, క్షేత్రస్థాయిలో సేకరించే సమాచారాన్ని సక్రమంగా నమోదు చేయాలని బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లకు సూచించారు. నిర్దేశిత గడువుల్లో పనులను పూర్తి చేసి, ఓటరు వివరాల నవీకరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.

# మహిళ ఆర్థికంగా బలపడితేనే కుటుంబం బలపడుతుంది జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ.







విజయవాడ, పెన్ పవర్, జూన్, 13, గొల్లపూడిలోని రైజ్ సెంటర్‌లో మహిళలకు సోలార్ డ్రైయింగ్ పౌడర్ ప్రాసెసింగ్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని శనివారం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ ప్రారంభించారుమహిళా సాధికారతకు నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాలు అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో సహజ సిద్ధమైన ఆహార ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని సోలార్ డ్రైయింగ్ సాంకేతికత ద్వారా విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసి మంచి ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ, ఉద్యాన పంటలతో పాటు వివిధ రకాల పండ్లు, కూరగాయలను సోలార్ డ్రైయింగ్ ద్వారా నిల్వ చేసి పౌడర్ రూపంలో ప్రాసెస్ చేయడం ద్వారా అదనపు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. మహిళలు ఈ శిక్షణలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి రంగంలో ముందుకు రావాలని సూచించారు. ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి అనేక పథకాలను అమలు చేస్తోందని, స్వయం సహాయక సంఘాల సభ్యులు అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. రైజ్ సెంటర్ ద్వారా అందిస్తున్న శిక్షణలు మహిళలలో వ్యాపార నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి అవకాశాలను విస్తృతం చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో నిపుణులు సోలార్ డ్రైయింగ్ ప్రక్రియ, ఉత్పత్తుల తయారీ, నాణ్యత ప్రమాణాలు, మార్కెటింగ్ అవకాశాలపై మహిళలకు వివరించారు. శిక్షణలో పాల్గొన్న మహిళలు పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్.వి. నాంచారరావు, అగ్రో ఎంటర్‌ప్రైజెస్ ప్రతినిధి పవన్‌కుమార్, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, రైజ్ సెంటర్ ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

# యాజలి గ్రామంలో అక్రమ మట్టి తవ్వకాలపై ప్రజల్లో ఆగ్రహం

కర్లపాలెం:(పెన్ పవర్) జూన్ 13 కర్లపాలెం మండల పరిధిలోని యాజలి గ్రామంలో జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న అక్రమ మట్టి తవ్వకాలపై సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని గ్రామ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మట్టి తవ్వకాలపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు గుప్పించిన నాయకులు, ఇప్పుడు జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న అక్రమ తవ్వకాల విషయంలో మౌనం ఎందుకు పాటిస్తున్నారని వారు నిలదీస్తున్నారు. కాల్వ కట్టలు, బోది కాల్వలు, చెరువుల పరిసర ప్రాంతాల్లో కూడా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ సంబంధిత శాఖ అధికారులు స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని వారు అంటున్నారు. అక్రమ మట్టి తవ్వకాల వెనుక ఎవరున్నారు? ఈ వ్యవహారంలో ఏ నాయకులు లేదా ప్రభావశీలులు ఉన్నారా? అనే అంశాలపై పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ముడుపులు చెల్లించిన వారికి చట్టాలు వర్తించవా? సామాన్య ప్రజలపై మాత్రమే అధికార యంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తుందా?

అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం, గనుల శాఖ మరియు రెవెన్యూ అధికారులు స్పందించి యాజలి గ్రామంలో జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న అక్రమ మట్టి తవ్వకాలపై విచారణ జరిపి, వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# విద్యార్థులకు ఉచిత కంటి, చెవి వైద్య శిబిరం



బాపట్ల:( పెన్ పవర్) జూన్ 13 బాపట్ల మండలంలో వెదుళ్లపల్లి గ్రామంలో శ్రీ గోపరాజు రామచంద్రరావు రుక్మిణమ్మ చారిటబుల్ ట్రస్ట్, ఉచిత వైద్యశాల మరియు ఉచిత కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఉచిత కంటి మరియు చెవి పరీక్షల శిబిరం అత్యంత విజయవంతంగా నిర్వహించబడింది. ఈ శిబిరంలో పరీక్షలు చేయించుకున్న విద్యార్థులకు అవసరమైన మందులను, కళ్ళజోళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ బి. వినోద్ కుమార్ విద్యార్థులకు చెవి పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయన విద్యార్థులకు చెవి సంరక్షణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. అలాగే డాక్టర్ అమృతపాణి పర్యవేక్షణలో ఆప్తోమెట్రిస్ట్ ఎం. సుభాషిని విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా కళ్ళజోళ్లను అందజేశారు. ఈ శిబిరంలో ప్రవాస భారతీయులైన డాక్టర్ మహదేవన్ మూర్తి నేమాని (ఎంఎస్, యుఎస్ఏ), డాక్టర్ మాధవి గోపరాజు(ఎండి,యుఎస్ఏ) ,ఇషా నెమాని, దివ్య వడ్లకొండలు పాల్గొని తమ ఉచిత వైద్య సేవలను అందించారు. అంతేకాకుండా, సంస్థ తరపున అర్హులైన వారికి ఉచితంగా కళ్ళజోళ్లను, వినికిడి యంత్రాలను క

# పోగొట్టుకున్న 15 మొబైల్ ఫోన్ల రికవరీ. బాధితులకు అప్పగించిన అర్బన్ సీఐ రమేష్.

చిలకలూరిపేట , పెన్ పవర్, జూన్ 13 : చిలకలూరిపేట : పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న 15 మొబైల్ ఫోన్లను పోలీసులు చాకచక్యంగా రికవరీ చేశారు.శనివారం చిలకలూరిపేట అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రికవరీ చేసిన ఫోన్లను బాధితులకు అందజేశారు. చిలకలూరిపేట అర్బన్ సీఐ రమేష్ చేతుల మీదుగా ఆయా ఫోన్లను వాటి అసలు యజమానులకు అప్పగించారు.ఈ సందర్భంగా సిఐ రమేష్ మాట్లాడుతూ...సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి,ప్రత్యేక నిఘా ద్వారా ఈ మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు తెలిపారు. ప్రజలు తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నప్పుడు వెంటనే పోలీస్ స్టేషన్‌లో లేదా సిఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.పోగొట్టుకున్న ఫోన్లను అతి తక్కువ కాలంలోనే తిరిగి పట్టుకుని,తమకు అప్పగించిన చిలకలూరిపేట



అర్బన్ పోలీసులకు మరియు ఇన్స్పెక్టర్ రమేష్‌కు బాధితులు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన నందమూరు విద్యార్థిని



పెదన, పెన్ పవర్, జూన్ 13 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నందమూరుకు చెందిన విద్యార్థిని జోగి సంకీర్తన ట్రిపుల్ ఐటీ ఒంగోలు క్యాంపస్‌లో సీటు సాధించి ప్రతిభ చాటింది. మార్చి 2026లో జరిగిన పదో తరగతి పరీక్షల్లో 573 మార్కులు సాధించి పాఠశాలలో ప్రథమ స్థానం పొందిన ఆమె, తాజాగా విడుదలైన ట్రిపుల్ ఐటీ ప్రవేశ ఫలితాల్లో ఎంపికైంది. ఈ నెల 22న సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారులు శ్రీమతి సలోమి, వై.వి. హరనాథ్, ప్రధానోపాధ్యాయులు కె. సత్యనారాయణతో పాటు ఉపాధ్యాయులు సంకీర్తనను అభినందించి, ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థిని సాధించిన ఈ విజయం పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
వరతులు వర్తిస్తాయి

# 2,000 ఉద్యోగాల భర్తీకి 40 ప్రముఖ కంపెనీల భాగస్వామ్యం

## నిరుద్యోగ యువతకు సువర్ణావకాశం : ఆర్టీసీ డిపో మేనేజర్ యద్దనపూడి వేణు బాబు



చిలకలూరిపేట , పెన్ పవర్, జూన్ 13 : చిలకలూరిపేట : పట్టణంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ నెల 16వ తేదీన మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు చిలకలూరిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ యద్దనపూడి వేణు బాబు తెలిపారు. ప్రత్తిపాటి ఫౌండేషన్, ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్త సహకారంతో, మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మార్గదర్శకత్వంలో, ప్రత్తిపాటి శరత్ ఆధ్వర్యంలో ఈ మెగా జాబ్ మేళా నిర్వహించబడుతున్నట్లు ఆయన వెల్లడించారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చిలకలూరిపేటలోని ప్రత్తిపాటి గార్డెన్స్‌లో ఈ నెల 16వ తేదీ (మంగళవారం) ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాబ్ మేళా కొనసాగుతుందని తెలిపారు. ఈ మేళాలో దాదాపు 40 ప్రముఖ కంపెనీలు పాల్గొంటుండగా, సుమారు 2,000 ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి నుండి పీజీ తదితర విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చని చెప్పారు. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతీ యువకులు తమ విద్యార్హతలు, నైపుణ్యాలు, ఆసక్తులకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలను పొందేందుకు ఈ మేళా చక్కని వేదికగా నిలుస్తుందని తెలిపారు. ప్రత్యేకించి ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలు, చిలకలూరిపేట పట్టణం మరియు పరిసర ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను జాబ్ మేళాకు పంపించి ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు తమ విద్యార్హతల ధ్రువపత్రాల ఒరిజినల్స్, జిరాక్స్ కాపీలు, నవీకరించిన బయోడేటా, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరుకావాలని తెలిపారు. అర్హతలు, ప్రతిభ ఆధారంగా పలువురు అభ్యర్థులకు అక్కడికక్కడే ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉందని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ప్రత్తిపాటి శరత్‌లకు ఈ సందర్భంగా యద్దనపూడి వేణు బాబు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. యువత భవిష్యత్ నిర్మాణంలో ఉపాధి కీలక పాత్ర పోషిస్తుందని, ఈ మెగా జాబ్ మేళా ద్వారా వందలాది మంది యువతకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభించి వారి జీవితాల్లో కొత్త ఆశలు నింపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉపాధి కోసం ఎదురుచూస్తున్న యువతకు ఈ మెగా జాబ్ మేళా ఒక సువర్ణావకాశంగా నిలవనుందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ కెరీర్‌కు బలమైన పునాది వేసుకోవాలని ఆర్టీసీ డిపో మేనేజర్ యద్దనపూడి వేణు బాబు పిలుపునిచ్చారు.

# కొండి శెట్టి సురేష్ బాబు కు మ్యూజిక్ అండ్ ఆర్ట్స్ యూనివర్సిటీ వారి ఘన సన్మానం

విజయవాడ, పెన్ పవర్, జూన్, 13, ఫరీదాబాద్ అవార్డ్స్ ప్రదానోత్సవం కార్య క్రమం కి 21 వ సారి ముఖ్య అతిథిగా డాక్టరేట్ అవార్డు గ్రహీత బెస్ట్ జర్నలిస్ట్ అవార్డు గ్రహీత పబ్లిక్ సోషల్ సర్వీస్ హీరో అవార్డ్ గ్రహీత డా కొండి శెట్టి సురేష్ బాబు ప్రెసిడెంట్ జాతీయ ఆర్ ఎం పీ పి ఎం పి సంఘాల సమైక్య . జాతీయ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం. చీఫ్ ఎడిటర్ కె స్ 9 న్యూస్ ఛానల్ . ఏ జన సేన పేపర్ ఏపీ స్టేట్ బ్యూరో చీఫ్ కొశిడిశెట్టి సురేష్ బాబు కు మన సన్మానం జరిగింది అవార్డ్స్ తీసుకున్న ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు అభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఎం బి ఆర్ చైర్మన్ డాక్టర్ సి పి యాదవ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ అవార్డ్స్ ఇవ్వటం కొరకు అన్ని అనుమతులు కేంద్ర ప్రభుత్వాలు నుండి అన్ని అనుమతులు తీసుకున్నాముం అని తెలియజేశారు




# బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్ డి ఓ

బాపట్ల:( పెన్ పవర్) జూన్13 బాపట్ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో)గా బాధ్యతలు స్వీకరించిన ఏ. హరికుమార్ బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీకి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బాపట్ల రెవెన్యూ డివిజన్ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు మెరుగైన సేవల అందజేత, ప్రభుత్వ పథకాల సమర్థవంతమైన అమలుపై చర్చించినట్లు తెలిసింది. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీ సూచించారు. నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆర్డీవో ఏ. హరికుమార్ తెలిపారు. ఈ మర్యాదపూర్వక భేటీలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# రెండేళ్లలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కనిపించలేదా : ఎమ్మెల్యే నసీర్






గుంటూరు, పెన్ పవర్, జూన్, 13, వైసీపీ శ్రేణులు ప్రజాహితమైన అంశాలపై మాట్లాడితే స్వాగతిస్తామని, ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే మాత్రం తోకలు కత్తిరిస్తామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శనివారం రాత్రి స్థానిక తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ రెండేళ్ల కాలంలో రాష్ట్రంలో సువర్ణపాలన అందించామని, వైసీపీ మాత్రం అడ్డగోలు విమర్శలు చేస్తోందని మండిపడ్డారు. రెండేళ్ల కాలంలో తల్లికి వందనం అమలు చేసినందుకా ? సూపర్ సిక్స్ ను సూపర్ హిట్ చేసినందుకా? స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం అందించినందుకా ? పింఛన్లు పెంచినందుకా ? అన్ని వర్గాలకు ప్రభుత్వ పథకాలను చేరువచేసినందుకా ? దేనికి వైసీపీ నేతలు విమర్శలు చేస్తున్నారని ప్రశ్నించారు. సైకో జగన్ బెంగళూరు విహారయాత్రలు చేస్తూ తమ కార్యకర్తలను ఉత్తేజపరిచేందుకు ప్రభుత్వంపై విమర్శలు చేస్తుంటారని దుయ్యబట్టారు. ఐదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రానికి డ్రాయర్ల కంపెనీలు కూడా తీసుకురాలేని జగన్ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని, వారి వైఖరిని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం 50 వేల కోట్ల రూపాయలతో అమరావతి నిర్మాణాన్ని చేపట్టిందని తెలిపారు. పోలవరంతోపాటు పారిశ్రామిక ప్రగతికి బాటలు వేసిందన్నారు. గూగుల్ తో పాటు ప్రధాన కంపెనీలు రాష్ట్రానికి క్యూ కట్టాయని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో దేశంలో ఎక్కడా లేనివిధంగా డీఎస్సీని సమర్థవంతంగా అమలు చేశామన్నారు. తాము ప్రజలకు 24 గంటలపాటు అందుబాటులో ఉంటామని, ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. ఏదైనా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలపై మాట్లాడాలని హితవు పలికారు. గుంటూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పిల్లి మాణిక్యాలరావు మాట్లాడుతూ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రానికి మహర్దశ తీసుకొచ్చామని తెలిపారు ప్రతి గడపలోనూ సంతోషాలు కనిపిస్తున్నాయని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాకుండా చెప్పని కార్యక్రమాలను అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

# రెండు కార్లు ఢీకొని కారు బోల్తా



బాపట్ల:( పెన్ పవర్ ) బాపట్ల జిల్లా వాడరేవు సమీపంలోని నూతన బైపాస్ రోడ్డుపై శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. వారిలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా, ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం ప్రకారం, ఒక కారు రాంగ్ రూట్‌లో రావడంతో ఎదురుగా వచ్చి మరో కారును ఢీకొట్టింది. ఢీకొట్టిన తీవ్రతకు ఒక కారు బోల్తా పడగా, మరో కారుకు తీవ్ర నష్టం వాటిల్లింది. గాయపడిన వారిని వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ప్రమాదానికి గురైన వాహనాల్లో ఒకటి గుంటూరు ప్రాంతానికి చెందినదిగా, మరొకటి చీరాల ప్రాంతానికి చెందినదిగా స్థానికులు తెలిపారు. ప్రమాదానికి గల ఖచ్చిత కారణాలు పోలీసుల విచారణలో వెల్లడికావాల్సి ఉంది.

# రామాపురంలో నిర్మాణంలో ఉన్న రిసార్ట్‌లో భారీ చోరీ

బాపట్ల:( పెన్ పవర్) జూన్13 చీరాల మండలం రామాపురంలో నూతనంగా నిర్మాణంలో ఉన్న ఓ రిసార్ట్‌లో భారీ చోరీ ఘటన చోటుచేసుకుంది. గుర్తుతెలియని దుండగులు సుమారు రూ.10 లక్షల విలువైన ఎలక్ట్రికల్ కాపర్ వైర్లు అపహరించినట్లు సమాచారం. అత్యంత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, చోరీ సమయంలో ఆధారాలు దొరకకుండా సీసీ కెమెరా బాక్స్‌ను కూడా దుండగులు తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. దీంతో ఘటన మొత్తం కెమెరాల్లో రికార్డు కాకుండా జాగ్రత్త పడ్డారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సమాచారం ప్రకారం ఈ ఘటన రాత్రి సుమారు 3 గంటల సమయంలో జరిగినట్లు తెలుస్తోంది. ఇదే రిసార్ట్‌లో ఇది మూడోసారి చోరీ జరగడం స్థానికంగా కలకలం రేపుతోంది. రిసార్ట్ యజమానులు మాట్లాడుతూ, రాత్రి వేళల్లో పోలీసుల నిఘా వ్యవస్థ సమర్థంగా పనిచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరుస చోరీలతో రిసార్ట్ యజమానులతో పాటు పరిసర ప్రాంత ప్రజలు, యాత్రికులు భయాందోళనకు గురవుతున్నారు. దుండగులను గుర్తించి త్వరితగతిన దర్యాప్తు చేపట్టి, వరుస చోరీలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా పిట్టలవానిపాలెం గ్రామంలో అవగాహన

చందోలు:( పెన్ పవర్) జూన్13 చందోలు పోలీస్ స్టేషన్ ఎస్సై కే. మాధవరావు 'విజిబుల్ పోలీసింగ్' కార్యక్రమంలో భాగంగా పిట్టలవానిపాలెం గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం అవసరమని సూచించారు. అనంతరం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో రోడ్డు భద్రతపై ప్రత్యేకంగా మాట్లాడిన ఎస్సై మాధవరావు, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, 'శిరోరక్ష -- ప్రాణరక్ష' అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. అలాగే మహిళలపై జరుగుతున్న నేరాల నివారణ, గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో భద్రతను మరింత మెరుగుపరచేందుకు సీసీటీవీ కెమెరాల ఏర్పాటు అవసరమని వివరించారు. ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినా లేదా నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని గ్రామస్తులకు సూచించారు. గ్రామ ప్రజలు పోలీసుల సూచనలను స్వాగతిస్తూ శాంతిభద్రతలపరిరక్షణకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.




# పీఈఎస్ పబ్లిక్ స్కూల్ కు ప్రతిష్టాత్మక గ్రీన్ స్కూల్ అవార్డు

చిత్తూరు :పెన్ పవర్,జూన్ 13 ఇండియా ఎడ్యుకేషన్ ఎన్‌క్లేవ్ 2026, బిజినెస్ అసెంట్ సంయుక్తంగా నిర్వహించిన జాతీయ స్థాయి అవార్డుల కార్యక్రమంలో పీఈఎస్ పబ్లిక్ స్కూల్, చిత్తూరు ప్రతిష్టాత్మకమైన గ్రీన్ స్కూల్ అవార్డును అందుకుంది. ఈ కార్యక్రమం శనివారం నాడు బెంగళూరులోని హయత్ సెంట్రిక్ హోటల్లో ఘనంగా నిర్వహించబడింది. దేశవ్యాప్తంగా 1000కు పైగా పాఠశాలలను సర్వే చేయగా, వివిధ విభాగాలలో అవార్డులకు 50కు పైగా పాఠశాలలు మాత్రమే అర్హత సాధించాయి. వాటిలో పర్యావరణ పరిరక్షణ, హరిత కార్యక్రమాల అమలు, విద్యార్థుల్లో పర్యావరణ అవగాహన పెంపొందించడం వంటి అంశాలలో విశిష్ట ప్రతిభ కనబరిచినందుకు పీఈఎస్ పబ్లిక్ స్కూల్ ఈ గౌరవాన్ని దక్కించుకుంది. ఈ అవార్డును పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ వై.వి. కృష్ణబాబు గారు పాఠశాల తరపున స్వీకరించారు. పాఠశాలలో చేపడుతున్న వృక్షారోపణ కార్యక్రమాలు, నీటి సంరక్షణ, వ్యర్థాల నిర్వహణ, విద్యుత్ పొదుపు చర్యలు, పర్యావరణ విద్య మరియు విద్యార్థుల్లో ప్రకృతి పట్ల బాధ్యతాయుతమైన దృక్పథాన్ని పెంపొందించే కార్యక్రమాలు ఈ గుర్తింపుకు ప్రధాన కారణమయ్యాయి. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శ్రీ వై.వి. కృష్ణబాబు గారు మాట్లాడుతూ .... ఈ అవార్డు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల సమిష్టి కృషికి లభించిన గుర్తింపు అని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా పర్యావరణ పరిరక్షణ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు మరింత కృషి చేస్తామని తెలిపారు. ఈ విజయంపై పాఠశాల యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.




# ఆర్మీ పెన్షన్ రాక బాధపడుతున్న వితంతువు



బాపట్ల ( పెన్ పవర్) జూన్13 చీరాల మండలం రామ్ నగర్ నివాసి దివంగత మాజీసైనికుడు రమేష్ నాయుడు భార్య లక్ష్మి తన కు వస్తున్న ఫామిలీ పెన్షన్ గత మూడు నెలలు ఆగిపోయి బాధపడుతున్న సమయం లో బ్యాంకు వెళితే స్పర్శ్ కి వెళ్ళమని చెప్పారని, బాపట్ల లో ఏ జి కాలేజీ లో స్పర్శ్ సేవా కేంద్రం ఉంది అని వస్తే అది గుంటూరు కు బదిలీ చేసారని అప్పుడు వర ప్రసాద్ జ్ఞాపకం వచ్చారని ఈ రోజున బాపట్ల నరాలశెట్టి వారి పాలెం లో గల రాష్ట్ర త్రిదళ మాజీసైనికుల సంక్షేమ లీగ్ ముఖ్యలయానికి వచ్చి తన సమస్యను చెప్పుకొనగా, పూర్తి వివరాలను పరిశీలించిన రాష్ట్ర మాజీసైనికుల సంఘం అధ్యక్షులు రెడ్డి వర ప్రసాద్ తమ కార్యాలయం నందు గల సేవా కేంద్రం ద్వారా డెమోగ్రాఫిక్ వాలిడేషన్ ప్రక్రియ పూర్తి చేసి డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ అందించి మరెక్కడకు తిరిగి ఇబ్బంది పడవలసిన అవసరం లేదని చెప్పి ప్రింట్ చేసి కాపీ ని అందించారు. రాష్ట్ర మాజీసైనికులు ఎవరైనా ఇటువంటి సమస్యలతో బాధపడుతూ ఉంటే తమ సమస్యను వివరించిన యెడల తగు సేవలందించబడునని వర ప్రసాద్ తెలియచేసారు. సేవలందుకున్న లక్ష్మి మరొకచోటకు వెళ్ళవలసిన అవసరం లేకుండా తిరగకుండా,

అవుతుందో లేదో అనే సందేహం లేకుండా, తన సమస్యను పరిష్కరించినందుకు, మన బాపట్ల లోనే అందరికి సేవలందుతున్నాయన్న విషయం నా పరిసర ప్రాంతాల వారికి తెలియచేస్తానని ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర మాజీసైనికులు మన రాష్ట్రం లో ఏ మూల ప్రాంతం నుండి ఫోన్ చేసి ఎడల పూర్తి వివరాలు సేకరించి తగు సహాయం చేయబడునని వర ప్రసాద్ తెలిపారు.

## మండల స్థాయి యోగాంధ్ర 2026 పోటీలు శ్రీనివాసరావు ఎంపీడీవో డాక్టర్ ఆర్ శ్రీనివాస్ ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి పరిపాల





పల్నాడు జిల్లా రాజుపాలెంపెన్ పవర్,జూన్ 13 మండలం మండల అభివృద్ధి కార్యాలయంలో యోగాంధ్ర 20 26 పోటీలు ఎంపీడీవో శ్రీనివాసరావు .,మరియు ఆయుష్ విద్యాధికారి డాక్టర్ ఆర్ శ్రీనివాస్ జిల్లా యోగాంధ్ర యోగా పోటీల ఇంచార్జి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది ..మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించిన యోగ పోటీల్లో గెలుపొందిన వారినందర్నీ మండల స్థాయిలో 10 నుండి 18 సంవత్సరాల వయసు మరియు 19 నుండి 35 సంవత్సరాలు వయసు 36 సంవత్సరాలు పైన ఉన్న విద్యార్థులకు స్త్రీలకు పురుషులకు ఆసనాలు సూర్య నమస్కారాలు ధ్యానము ప్రాణయామము స్కిట్ స్లోగన్స్ వ్యాసరచన చిత్రలేఖనము సింకనిజుడ్ యోగ మొదలగు వాటిపైన యోగా పోటీలను నిర్వహించడం జరిగింది న్యాయ నిర్ణయతలగా ఏ రమేష్ గారు వి పద్మజ యోగా గురువులు ఉండి ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలను ఎంపిక చేసినారు ఈ కార్యక్రమంలో అన్ని గ్రామ పంచాయతీల సెక్రటరీలు మరియు సిబ్బంది ఎంపీడీవో కార్యాలయం మీరాబి శ్యామ్ గారు ముక్కంటి గారు మండల అధికారులు పెద్ద ఎత్తున వివిధ గ్రామాల నుండి వచ్చిన పోటీదారులు శ్రీనివాస్ రెడ్డి వెంకట్ రమణ వెంకటేశ్వర్ రెడ్డి సత్యనారాయణ వెంకట్ రెడ్డి ఆయుస్ సిబ్బంది జిలాని మొదలగు వారు పాల్గొన్నారు పది నుండి 18 సంవత్సరాల విజేతలు మెట్టు అరవింద రెడ్డి శివ శంకర్ రెడ్డి భీమేశ్వరరావు దేవి రెడ్డి రూపిక మెట్టు జగదీశ్వరి బి ఇందుశ్రీ విద్యా శ్రీజగదీశ్వరి మీ తీష్ రెడ్డి. 19నుండి35 సంవత్సరాలు కే మహేష్ జె డేవిడ్ షేక్ బాజీ సిద్దు శ్రీనాథ్ వెంకట వీరాంజనేయులు ప్రశాంతి శివ అంజుమన్ తోట నరసయ్య హనుమంతరావు మరియు 35 సంవత్సరాలు పైబడిన వారిలో ముప్పూరు వెంకటేశ్వర్లు అంచులు ఏడుకొండలు శ్రీనివాసరావు సత్యనారాయణ శ్రీనివాస్ రెడ్డి గెలుపొందినట్లు న్యాయ నిర్ణీతలు ప్రకటించారు ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్ శ్రీనివాస్ జిల్లా యోగ కాంపిటీషన్ ఇన్చార్జి మాట్లాడుతూ గత ఆరు రోజుల నుండి వివిధ గ్రామాల్లో యోగా పోటీలు నిర్వహించడానికి సహకరించిన పంచాయత్ రాజు కార్యాలయాలు సిబ్బందికి ఈవోపీఆర్డి గారికి శ్యామ్ గారికి ప్రత్యేకంగా ఎంపీడీవో శ్రీనివాస్ రావు గారికి ఆయుష్ శాఖ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపినారు

## ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్న శాసనసభ్యులు కన్నా.....






రాజుపాలెం పెన్ పవర్,జూన్ 13 సత్తెనపల్లి పట్టణం రఘురామ్ నగర్ కార్యాలయం నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్నతెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు సత్తెనపల్లి నియోజకవర్గ శాసన సభ్యులు శ్కన్నా లక్ష్మి నారాయణ ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రాలు అందించారు. ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించిన శాసనసభ్యులు కన్నా గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు ... ఈ సందర్భంగా ప్రజలు. నా దృష్టికి కొన్ని సమస్యలు. గృహ,పెన్షన్, వైద్యం,పలు సమస్యలు తీసుకొచ్చారు. సమస్యల తక్షణ పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.అందరి సమస్యలు పరిష్కరిస్తామని, హామీ ఇచ్చారు

## ఉపాధి హామీ పథకం పనుల్లో క్షేత్ర స్థాయిలో సహాయకుల చేతివాటం - పట్టించుకోని అధికారులు

### ఏఐ టెక్నాలజీ ని మించి ఫోటోల మాయాజాలం
### కూలీల నియమ నిబంధనలు.... బేకాతరు



ఫిరంగిపురం మండలం :పెన్ పవర్,జూన్ 13 మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి ఉపాధి హామీ పథకంలోనిండు కుండలా పేరుకుపోయిన అవినీతి... అడ్డుకట్ట వేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు.... ప్రభుత్వంలో ఎన్ని నియమ నిబంధనలు తెచ్చినప్పటికీ అవినీతి ఆగడాలు మాత్రం ఆగటం లేదు. ఉపాధి పనుల్లో క్షేత్ర సహాయకుల చేతివాటం చూపిస్తు అవినీతికి పాల్పడుతున్నారని పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలపరిధిలోని ఫీల్ అసిస్టెంట్లు తమ బంధు వర్గానికి స్నేహితులకు, పలువురు కూలీలకు, నీకు సగం నాకు సగం అన్న మాట తో నగుదు పంచుకుంటున్నట్లుగా పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరి ఉపాధి హామీ పనుల్లో భాగంగా ఎంతవరకు అధికారులు వెళ్లి గ్రామాలలో తనిఖీలు చేస్తున్నారంటే పని శూన్యం లాభసాటి ఫలితం కోసం దొడ్డి దారిలో ఆశించి చేతివాటం చూపుతున్నారని చెప్పుకోవచ్చు.అసలు పనికి రాకుండా మస్టర్ రోల్ లో పేరు ఎలా పెడుతున్నారంటూ కొందరు ఉపాధి కూలీలు ఆరోపణలు వినిపిస్తున్నాయి క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలను మాత్రం అధికారులు పట్టించుకోక పోవడం తో అవినీతి ఆగడాలను అడ్డు కునేదెవరు.....? ఇక పని సంగతి కొస్తే కొన్నిచోట్ల ఉపాధి పని దినాలు చేపట్టకుండా నిర్వహించకుండా అరకొర పనులు చూపి ఎక్కువ మొత్తంలోప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు అని చెప్పాలి... సగటున కొన్నిచోట్ల ఉపాధి పని నిలిపి వేసి ప్రొక్లైన్ సహాయంతో పనులు చేపడుతున్నారని సమాచారం..ఉంది..

మరి కొన్ని చోట్ల కాలువ పనులకు జెసిపి నీ ఉపయోగించి ప్రభుత్వ ఖజానా ఖాళీ చేస్తున్నారంటూ పలు వార్తా దిన పత్రికల్లో వార్తలు వస్తున్నాయి. ఇది ఇలా ఉంటే కొన్ని గ్రామాలలో ఉపాధి కూలీలు గ్రామాల్లో నివసించకుండా వేరే గ్రామాలు వలస వెళ్లిన వారికి ఉద్యోగ రీత్యా పట్టణాల్లో స్థిరపడిన వారికి ఉన్నత చదువు కోసం కాలేజీలకు వెళ్లిన వారి స్థానంలో పేర్లు మాస్టర్లో నమోదు కావడం చర్చానియ అంశంగా మారింది. ఫేషియల్ రి సి గ్నేషన్ ఉన్నప్పటికీ ఏఐ టెక్నాలజీని మించి క్షేత్ర సహాయకులు గ్రామం బయట ఉన్నటువంటి వారిని గుర్తించి ఫోటోలు అప్లోడ్ చేస్తున్నారంటే ఎంత టెక్నాలజీని ఉపయోగిస్తున్నారో అని పలువురు వాపోతున్నారు.. కొందరినైతే ఉదయాన్నే పనికి పురమాయించి కూలీల ఫోటోలు తీసుకొని కాసేపు పని దగ్గర ఉండి ఇంటికి తిరుగు ముఖం పడుతున్నారు...అంటూ కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలస్థాయిలో ఉన్న బీప్టీలు ఏం చూస్తున్నారు....? టెక్నికల్ అసిస్టెంట్లు ఏంచేస్తున్నారు....? అలాగే ఏపీవోలు ఇంత అవినీతి జరుగుతున్నా కూడా పట్టిపట్టినట్లు వ్యవహరిస్తున్న తీరు ను పలువురు ప్రశ్నిస్తున్నారు. సొసైటీలో అధికారం చేపట్టిన పార్టీలు మారగానే ఉపాధి హామీ పథకంలో క్షేత్ర సహాయకులు, వెలుగు కార్యాలయాల్లో యానిమేటర్లు, అధికార పార్టీ ల జోక్యంతో కొందరి పేర్లు తప్పించి పార్టీకి అవసరమైన వారి పేర్లు మారిపోతూ ఉంటారు. మరి జరిగిన అవినీతి మాయ జలాన్ని గురించి అడిగేది ఎవరు. ప్రభుత్వ ఖజానా నుంచి మాయమైన ప్రజల సంపద రికవరీ చేసేదెవరు..అంటే ఆది అంతే సంగతి.... అంటి... అంతే... అంతే..అన్నమాట....

## ఉమ్మడి విజయనగరం జిల్లా జడ్పీటీసీ సభ్యులకు ఐదు రోజుల కేరళ పర్యటన

విజయనగరం :పెన్ పవర్,జూన్ 13 ప్రజా సేవలో నిరంతరం ప్రజల మధ్య ఉంటూ, గత ఐదేళ్లుగా జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఉమ్మడి విజయనగరం జిల్లా జడ్పీటీసీ సభ్యులందరికీ ప్రత్యేక గుర్తింపుగా ఉమ్మడి విజయనగరం జిల్లా జడ్పీ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) తన సొంత ఖర్చులతో ఐదు రోజుల కేరళ పర్యటనకు శనివారం పయనమయ్యారు. ఈ సందర్భంగా విశాఖపట్నం విమానాశ్రయం నుండి ప్రయాణం ప్రారంభించిన జడ్పీటీసీ సభ్యులు, అనంతరం హైదరాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో జడ్పీటీసీ సభ్యులు వర్రి నరసింహమూర్తి , జడ్పీటీసీ ప్రతినిధి వల్లి రెడ్డి శ్రీను జన్మదిన వేడుకలను అందరూ కలిసి కేక్ కట్ చేసి ఆనందంగా జరుపుకున్నారు.

## పల్నాడు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు మంజూరైన మొత్తం 484 అదనపు తరగతి గదులు, 55 టాయిలెట్ల నిర్మాణాలు నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా అధికారులను ఆదేశించారు....



నరసరావుపేట పెన్ పవర్,జూన్ 13 స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల్లో నిర్మాణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పల్నాడు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు మంజూరైన మొత్తం 484 అదనపు తరగతి గదులు, 55 టాయిలెట్ల నిర్మాణాలు నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా అధికారులను ఆదేశించారు....

## ఎస్ఐఆర్ మ్యాపింగ్ కార్యక్రమాన్ని పరిశీలించిన తహసిల్దార్



ఫిరంగిపురం మండలం :పెన్ పవర్,జూన్ 13 మండలంలో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని తహసిల్దార్ ప్రసాదరావు శనివారం పరిశీలించారు... స్థానిక సెయింట్ పాల్స్ ఉన్నత పాఠశాల, సెయింట్ ఆన్స్ సెంచలరి ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో శనివారం పోలింగ్ కేంద్రాలను సందర్శించి, బీఎల్‌వోలు నిర్వహిస్తున్న ఓటరు జాబితా మ్యాపింగ్ ప్రక్రియను తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అందిస్తున్న సేవలు, కార్యక్రమ నిర్వహణ తీరును పరిశీలించిన తహసిల్దార్, ఓటరు వివరాల ధృవీకరణను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అర్హత కలిగిన ఓటరుకు సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని బీఎల్‌వోలకు సూచనలు సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 15వ తేదీ నుంచి జూలై 14వ తేదీ వరకు బీఎల్‌వోలు ఇంటింటికీ తిరిగి ఓటరు జాబితా ఎస్ ఐ ఆర్ సర్వే నిర్వహిస్తారని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను పొందుపరిచి సరిచూసుకొని బి ఎల్ ఓ లకు సహకరించాలని కోరారు.

## దళిత క్రైస్తవుల పై డిప్యూటీ స్పీకర్ కొత్త దాడి



గుంటూరు జిల్లా, ఫిరంగిపురం : పెన్ పవర్,జూన్ 13 ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు తాజాగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసే వారి ఎస్సీ హోదాను పోలీసులు ముందుగా ధ్రువీకరించాలని డీజీపీకి లేఖ రాయడం తీవ్ర ఆందోళన కలిగించే విషయం వెలుగులోకి వచ్చింది.. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమానత్వం, గౌరవం, రక్షణ హక్కులను కల్పించింది. కానీ దళిత క్రైస్తవుల విషయంలో మాత్రం మరోసారి వివక్షపూరిత వైఖరిని ప్రదర్శిస్తున్నారు. దేశంలో దళిత క్రైస్తవులు సామాజిక పోరాటంలో అవమానాలు, కులదూషణలు, అంటరానితనం వంటి అనేక రకాల వివక్షను ఎదుర్కొంటున్న వాస్తవాన్ని ఆయన విస్మరిస్తున్నారు... భారత రాజ్యా పొందు పరచిన అట్రాసిటీ చట్టం ఉద్దేశం కేవలం ఒక కుల ధ్రువీకరణ పత్రాన్ని రక్షించడం కాదు. శతాబ్దాలుగా అణచివేతకు గురైన బలహీన వర్గాలను కులహింస, అవమానాల నుండి రక్షించడం. ఒక వ్యక్తి మతం మార్చుకున్నాడనే కారణంతో అతని సామాజిక వాస్తవికత ఒక్కరోజులో మారిపోదు. కుల వివక్ష అనేది మతంతో ముగిసిపోయే సమస్య కాదు. డిప్యూటీ స్పీకర్ ప్రతిపాదన అమలైతే, అట్రాసిటీ బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ప్రతిసారి ముందుగా తమ కులాన్ని నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అయితే న్యాయం కోసం వచ్చిన బాధితులను అనుమానితులుగా చూడటంతో సమానం. ఫిర్యాదు స్వీకరించడంలో ఆలస్యం జరిగితే బాధితులకు మరింత అన్యాయం జరుగుతుంది అన్న విషయం నిజం.. దళిత క్రైస్తవులపై జరుగుతున్న సామాజిక వివక్షను గుర్తించి వారికి ఎస్సీ హోదా కల్పించాలనే డిమాండ్ దేశవ్యాప్తంగా చాలా కాలంగా కొనసాగుతోంది... అలాంటి సమయంలో క్రైస్తవుల హక్కులను మరింత పరిమితం చేసే ప్రయత్నాలు సామాజిక న్యాయ స్ఫూర్తికి విరుద్ధం. రాష్ట్రంలో ప్రజాప్రతినిధుల బాధ్యత సమాజంలోని బలహీన వర్గాలకు రక్షణ కల్పించడం. కానీ రఘురామకృష్ణరాజు లేఖ దళిత క్రైస్తవులను అనుమానంతో చూసే ధోరణిని ప్రోత్సహిస్తోంది. ఇది సామాజిక న్యాయం, రాజ్యాంగ విలువలు మరియు డా. బి.ఆర్. అంబేద్కర్ కలలుగన్న సమానత్వ భారతానికి అనుకూలమైన వైఖరి కాదు.

దళితులపై జరుగుతున్న అణచివేతను అరికట్టాల్సిన సమయంలో, బాధితుల హక్కులను ప్రశ్నించడం కాకుండా కులహింసను అరికట్టే చర్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది...

## జిల్లా స్థాయి భారీ బహిరంగ సభకు తరలిరండి..!

### జగన్ రెడ్డి మనస్తత్వాన్ని ప్రజలు నమ్మరు..!
### -ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి




మాచర్ల, పెన్ పవర్,జూన్ 13 కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా "రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం" పేరిట నరసరావుపేట పోలీస్ పెరేడ్ గ్రౌండ్ నందు ఈ నెల 15, సోమవారం ఉదయం 10 గంటలకు జిల్లా స్థాయిలో నిర్వహించే భారీ బహిరంగ సభకు కూటమి పార్టీల శ్రేణులు తరలిరావాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చి ప్రజలకు భరోసా, నమ్మకాన్ని కలిగిస్తున్న కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతగా పల్నాడు జిల్లాలోని శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి, ఎంపీ లావు కృష్ణదేవరాయలు, ఇంచార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో జరిగే ఈ సభకు ప్రజలు, కూటమి పార్టీలైన టీడీపీ,జనసేన, బీజేపీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. ఇచ్చిన హామీలకు మించి ప్రజలకు మంచి చేస్తుంటే జగన్ రెడ్డికి నిద్రపట్టక నిరసనల పేరుతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. ఐదేళ్ల వైసీపీ పాలనచూసిన ప్రజలు జీవితంలో జగన్ రెడ్డిలాంటి సైకోకు ఓటు వేయొద్దని నిర్ణయించుకున్నారని, ఎన్ని కల్లబొల్లి మాటలు చెప్పినా మీ పప్పులు ఉడకవని ఎద్దేవా చేశారు.

## ముసునూరు 15వ వార్డులో ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో పాల్గొన్న..ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి





నెల్లూరు. పెన్ పవర్,జూన్ 13 కావలి పట్టణంలోని ముసునూరు 15వ వార్డులో నిర్వహించిన "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వార్డులో పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించారు.వార్డులోని ప్రధాన వీధులు,కాలువలు,చెత్త నిల్వ ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే పరిశుభ్రమైన పట్టణ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.ప్రజల ఆరోగ్య రక్షణకు పారిశుద్ధ్యమే ప్రధానమని పేర్కొంటూ, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన చెత్త సేకరణ వ్యవస్థను వినియోగించాలని సూచించారు.ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులకు పారిశుద్ధ్య నిర్వహణపై పలు సూచనలు చేసిన ఎమ్మెల్యే, వార్డులో పరిశుభ్రత పనులు నిరంతరం కొనసాగాలని ఆదేశించారు. ప్రజా భాగస్వామ్యంతో కావలిని మరింత పరిశుభ్రమైన, ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రైవేటు బస్సు దగ్ధం

తడ (తిరుపతి) :పెన్ పవర్,జూన్ 13 తిరుపతి జిల్లా తడ సమీపంలో జాతీయ రహదారిపై ఓ ప్రైవేట్ బస్సు దగ్ధమైంది. శనివారం శ్రీసిటీ నుంచి కార్మికులు విధులు ముగించుకొని సూళ్లూరుపేటకు వెళ్తున్నారు. తడ సమీపానికి రాగానే బస్సులో అకస్మాత్తుగా మంటలు రాజుకున్నాయి. అప్రమత్తమైన కార్మికులు వెంటనే బస్సు దిగడంతో ప్రాణనష్టం తప్పింది. చూస్తుండగానే మంటలు బస్సు మొత్తం వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటల్ని ఆర్పివేశారు. అప్పటికే వాహనం పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

# నయా స్ట్రాటజీతో జనసేనాని

**విజయవాడ, జూన్ 13, పెన్ పవర్:** జనసేన అధినేత పవన్ కల్యాణ్ తన ఆలోచన అంతా కొత్త ఓటు బ్యాంకుపైనే ఉంది. యువ ఓటర్లపైనే ఆయన ఎక్కువగా ఆశలు పెట్టుకున్నారు. వచ్చే ఎన్నికల నాటికి కొత్తతరం ఓటర్లు లక్షల సంఖ్యలో వస్తారు. వారే ఎన్నికల్లో విజయానికి కీలకంగా మారనున్నారు. గెలుపులో యువత కీలక భూమిక పోషిస్తుందని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. అందుకే తనకు కులాలు అంటగట్టవద్దని పదే పదే కోరుతున్నారు. తనను ఒక కులానికే ముద్ర వేసి చూడవద్దని, అందరూ ఓట్లు వేస్తేనే తాను గెలిచానని పవన్ కల్యాణ్ పదే పదే గుర్తు చేస్తున్నారు. దీని వెనక పవన్ ఆలోచన రాబోయే యువతరం ఓట్లను ఆకట్టుకునేందుకేనన్నది ఆయన నయా స్ట్రాటజీగా తెలుస్తుంది.ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చంద్రబాబును పక్కన పెడితే .. టీడీపీలో లోకేశ్, వైసీపీలో జగన్, జనసేనలో పవన్ అందరూ చిన్న వయసు వాళ్లే. అందరికంటే లోకేశ్ వయసులో చిన్న అయినప్పటికీ రాజకీయాల్లోకి వచ్చేసరికి మిగిలిన ఇద్దరూ కూడా యూత్ లీడర్ల కిందే లెక్క. అయితే ఈ ముగ్గురిలో యూత్ తనకు కనెక్ట్ అవ్వాలన్నది జనసేనాని ఆలోచనగా ఉంది. పవన్ కల్యాణ్ పై అవినీతి ముద్ర లేదు. మాట మీద నిలబడి ఉండరన్న పేరు తప్ప.. పవన్ కల్యాణ్ పై రెటువంటి చెడు అభిప్రాయం లేదు. మరొకవైపు పవన్ కల్యాణ్ ప్రజా సంక్షేమం కోసమే నిరంతరం పనిచేస్తారని, రాజకీయాల కంటే ఎక్కువగా అభివృద్ధి పనులపై ఫోకస్ పెడతారన్న పేరు తెచ్చుకోవాలన్న తాపత్రయంలో పవన్ కల్యాణ్ ఉన్నారు.ఇప్పటికే ఓటర్ల సమగ్ర సవరణ ప్రారంభం కానుంది. చాలా వరకూ ఓట్లు పోతాయి. 2029 ఎన్నికల్లో కొత్త ఓటర్లు వచ్చి చేరతారు. వారిని టార్గెట్ చేసుకుని తాను ముందుకు వెళితే గత ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే వస్తాయని పవన్ కల్యాణ్ అంచనా వేస్తున్నారు. తమిళనాడులో విజయ్ కు యువత, మహిళలు ఎక్కువగా కనెక్ట్ కావడంతోనే పార్టీ పెట్టిన ఏడాదిన్నరకే అధికారంలోకి వచ్చారు. అలాంటిది ప్రయత్నిస్తే తాను ఎందుకు కాలేనన్న నమ్మకంతో పవన్ కల్యాణ్ ఉన్నారు. అందుకే ఆయన సొంత సామాజికవర్గాన్ని కూడా దూరం చేసుకునేందుకు సిద్ధమయ్యారన్న టాక్ జనసేన వర్గాల్లో పెద్దయెత్తున చర్చ జరుగుతుంది. మొత్తం మీద పవన్ కల్యాణ్ యువతను ఎంత మేరకు ఆకట్టుకుంటారన్నది భవిష్యత్ లో తేలనున్నప్పటికీ ఆయన ఆలోచన మాత్రం విభిన్నంగా సాగుతుందనే చెప్పాలి.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## రాయలసీమలో లిమిటేషన్ రచ్చ

**తిరుపతి, జూన్ 13, పెన్ పవర్:** మరోసారి నియోజకవర్గాల పునర్విభజన అంశం తెరపైకి వచ్చింది. మొన్నటికి మొన్న మహిళా రిజర్వేషన్ బిల్లుతోపాటు నియోజకవర్గాల పునర్విభజన బిల్లు వెనక్కి వెళ్లిపోయిన సంగతి తెలిసిందే. మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడంతో పునర్విభజన బిల్లును వెనక్కి తీసుకుంది కేంద్రం. అయితే ఎట్టి పరిస్థితుల్లో పునర్విభజన బిల్లును ఆమోదించుకోవాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. అందుకు తగ్గ రాజకీయ పరిస్థితులు కలిసి వస్తున్నాయి. బెంగాల్ తో పాటు తమిళనాడులో లోక్సభ సభ్యుల బలం ఎన్డీఏకు అదనపు బలంగా మారనుంది. ఈ పరిస్థితుల్లో ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి నిన్ననే తాజా వర్కింగ్ పేపర్ నియోజకవర్గాల పునర్విభజనపై విడుదల చేసింది. దేశవ్యాప్తంగా పార్లమెంట్ స్థానాలు పెరగడంతో పాటు ఏపీలో కూడా పెరిగే ఛాన్స్ ఉంది. ఇప్పుడు ఉన్న 25 పార్లమెంట్ స్థానాలకు గాను మరో పదమూడు సీట్లు పెరుగుతాయి. అయితే సింహభాగం పెరుగుదల అనేది రాయలసీమలో కావడం ఇప్పుడు హాట్ టాపిక్ అవుతోంది.కొంతకాలంగా తీవ్ర అధ్యయనం చేసిన ఈ ఆర్థిక మండలి తన నివేదికను బయటపెట్టింది. కొత్త ప్రతిపాదనలను పెట్టింది. వీటిని చూస్తే పునర్విభజనతో ఎక్కువగా లాభపడేది రాయలసీమ. అత్యంత ప్రతిష్టాత్మకమైన లోక్ సభ స్థానాలుగా ఉన్న కడప, కర్నూలు, అనంతపురం, రాజంపేట నియోజకవర్గాల పరిధి చాలా పెద్దదిగా ఉంది. ఒక్కో పార్లమెంట్ స్థానాన్ని మూడు గా విభజిస్తే బాగుంటుందన్న అభిప్రాయం ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి అభిప్రాయపడింది. ఈ నాలుగు సీట్ల పరిధిలో మరో 8 పెరగనున్నాయన్నమాట. ఇదే జరిగితే భవిష్యత్తులో దేశ రాజకీయాలతో పాటు రాష్ట్రంలో అధికార పీఠాన్ని శాసించడంలో రాయలసీమ విపరీతమైన ప్రభావం చూపి అవకాశం ఉంది.రాయలసీమలో పునర్విభజనతో ఎనిమిది పార్లమెంట్ స్థానాలు పెరిగే అవకాశం ఉంది. అయితే ఉత్తరాంధ్రలో మాత్రం కేవలం రెండు లోక్ సభ సీట్లు పెరిగే ఛాన్స్ కనిపిస్తోంది. విశాఖ గ్లోబల్ సిటీగా మారుతున్న తరుణంలో విశాఖ పార్లమెంట్ నియోజకవర్గాన్ని మూడుగా విభజించాలని ఈ మండలి ప్రతిపాదించింది. అంటే విజయనగరం, శ్రీకాకుళంలో ఉన్న పార్లమెంట్ స్థానాలను యధాతథంగా ఉంచి.. విశాఖ పార్లమెంట్ స్థానం నుంచి ఓ రెండు స్థానాలను విభజించి పెంచుతారు అనేది ఈ ప్రతిపాదనల సారాంశం. అయితే ఆశ్చర్యకరంగా రాష్ట్రంలో అత్యధిక జనాభా, రాజకీయ ప్రాధాన్యత కలిగిన కోస్తాంధ్ర, నెల్లూరు, ప్రకాశం జిల్లాలో మాత్రం ఇప్పుడున్న సీట్లను యధాతథంగా ఉంచాలని ఈ నివేదిక స్పష్టం చేయడం గమనార్హం. కోస్తా జిల్లాల్లో జనాభా నియంత్రణ ప్రమాణాలు స్థిరంగా ఉండటం, నియోజకవర్గాల భౌగోళిక పరిమితులు ఓటర్ల సంఖ్యకు అనుకూలంగా ఉండటమే దీనికి ప్రధాన కారణం. 2027 జనాభా లెక్కల ప్రకారం ఈ పునర్విభజన చేపడితే రాజకీయంగా రాయలసీమ మరోసారి పై చేయి సాధించే అవకాశం ఉంది. దాదాపు 13 పార్లమెంటు స్థానాలు పెరగడంతో అన్ని పార్టీల్లో ఆశావహులకు అవకాశాలు దక్కుతాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో.

## ఫీల్ గుడ్ సరే... వీటి సంగతేంటీ...

**విజయవాడ, జూన్ 13, పెన్ పవర్:** అధికారాన్ని కోల్పోయిన తర్వాత వైసీపీలో విపరీతమైన నిరాశ కనిపిస్తోంది. అందువల్లే ఏ మాత్రం అవకాశం దొరికినా సరే వదిలిపెట్టకుండా దాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తోంది. జరిగింది ఇసుకంత అయితే.. దానిని పెద్ద బండరాయి లాగా చూపించే ప్రయత్నం చేస్తోంది. ఇది కూటమి ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారింది. అయితే ఇటువంటి లోపాల మీద కూటమి ప్రభుత్వ పెద్దలు చర్యలు తీసుకోకపోతే ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.అభివృద్ధి, సంక్షేమం అని చెబుతున్నప్పటికీ కూటమి ప్రభుత్వం కచ్చితంగా వీటి మీద దృష్టి పెట్టాలి. అన్ని రకాలుగా పింఛన్లను భారీగా పెంచామని ప్రభుత్వం చెబుతోంది. కానీ రెండు సంవత్సరాల కాలంలో ఇంతవరకు కొత్త పింఛన్లను మంజూరు చేయలేదు. కొత్తగా ఇళ్ల స్థలాలు ఇవ్వలేదు. గృహాలను కూడా నిర్మించలేదు. నాడు వైసిపి అధికారంలో ఉన్నప్పుడు అనర్హులకు పింఛన్లు ఇచ్చారు. వారిపై ఇంతవరకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. రీసర్వే సమస్యను ఇంతవరకు పరిష్కరించలేదు. క్వాంటం వ్యాలీ.. డేటా సెంటర్లు.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల సామాన్యులకు ఏ విధమైన ఉపయోగం లభిస్తుందో వివరించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వం మీద ఉన్నది. జగన్ అధికారంలో ఉన్నప్పుడు ఉద్యోగుల జీతాలు ఆలస్యం అయ్యేవి. విశ్రాంత ఉద్యోగుల పింఛన్లు కూడా సరిగా వచ్చేవి కాదు. పిఆర్సి అమల్లో జగన్ ప్రభుత్వం మొండిగా ఉండేది. చివరికి సిపిఎస్ రద్దు చేస్తామని చెప్పిన జగన్ వెనుకడుగు వేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగుల విషయంలో సానుకూల ధోరణితో కనిపిస్తోంది. వేల కోట్ల బకాయిలు విడుదల చేసింది. ఉద్యోగుల సమస్యల మీద దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.అమరావతి నిర్మాణంలో ప్రభుత్వం ఇంకా వేగం పెంచాల్సి ఉంది. కొన్ని విషయాల పట్ల పాఠాలు నేర్చుకోవాలి. ముఖ్యంగా ప్రభుత్వ భవనాలు.. సముదాయాల నిర్మాణం మీదనే ప్రభుత్వం దృష్టి సారించింది. అయితే పబ్లిక్ యాక్టివిటీ లో వేగం పెరగాలంటే కచ్చితంగా లే అవుట్లు డెవలప్ కావాలి. అవి లేకుండా అమరావతిలో ఎవరు కూడా ఇల్లు కట్టుకునే సాహసం చేయరు. వ్యాపారాలు ప్రారంభించలేరు.వైసీపీ పరిపాలనలో ఏపీ రాష్ట్రంలో ఆర్థిక లోటు పెరిగిపోయింది. సంక్షేమ పథకాలకు మాత్రమే నిధుల సర్దుబాటు జరుగుతోంది. అభివృద్ధి పనుల విషయంలో కాస్త ఇబ్బందికరమైన వాతావరణం ఏర్పడుతోంది. అప్పుల మీదనే ఆధార పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అందువల్ల అప్పుల భారం పెరిగిపోతుంది. వీటివల్ల కీలకమైన పథకాల అమలు సాధ్యం కావడం లేదు. ఉదాహరణకు ఎన్టీఆర్ వైద్య సేవ బకాయిలు భారీగా పెరిగిపోయాయి. ఈ పథకానికి నిధుల సర్దుబాటు చేయడం ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారింది.వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఇష్టానుసారంగా అధికారులు వ్యవహరించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో కూడా అలానే కొనసాగుతోంది. పొలిటికల్ గవర్నెన్స్ ను అమలు చేయాలని చంద్రబాబు చెబుతున్నప్పటికీ అధికారులు వినిపించుకోవడం లేదు. కన్సల్టెంట్లు ప్రభుత్వంలో హవా కొనసాగిస్తున్నారు. కన్సల్టెంట్లు చెప్పిన మాటనే ప్రభుత్వం పాటిస్తోంది.. కొన్ని సందర్భాలలో కన్సల్టెంట్లు చెప్పినట్టుగానే చంద్రబాబు చేయాల్సి వస్తుంది. దీనివల్ల సోషల్ మీడియాలో విష ప్రచారం జరుగుతోంది.సూపర్ సిక్స్ పథకాలలో ఇంకా రెండు అమలు కావడం లేదు. యువతకు 20 లక్షల ఉపాధి అవకాశాలు.. ఇది సాధికాకపోతే నెలకు 3000 నిరుద్యోగ భృతి.. ప్రతినెల మహిళకు 1500 రూపాయల చొప్పున ఆడబిడ్డ నిధి ఇస్తామని ఇచ్చిన హామీ అమలు కావడం లేదు. ఇక మిగతా పథకాలు తల్లికి వందనం.. అన్నదాత సుఖీభవ.. దీపం 2.. స్త్రీ శక్తి పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయి.కొంతమంది నేతలు ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారు. దారుణంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. అవినీతి వ్యవహారాలకు పాల్పడుతున్నారు. పోలీస్ విధుల్లో కూడా జోక్యం చేసుకుంటున్నారు. వారి వల్ల కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోంది.. ఎమ్మెల్యేలు వ్యవహార శైలి మార్చుకోవాల్సిన అవసరం ఉంది. స్వయంగా చంద్రబాబు రంగంలోకి దిగి హెచ్చరికలు జారీ చేస్తున్నారంటే.. ప్రజాప్రతినిధులు ఎలా వ్యవహరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

## అగ్రికల్చర్ లోహాఫ్ మూన్ స్ట్రక్చర్ విధానం..

**అనంతపురం, జూన్ 13, పెన్ పవర్:** ఉమ్మడి అనంతపురం జిల్లా.. కరవుకు కేరాఫ్ అడ్రస్.. దేశంలోనే అతి తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రాంతం. ఏళ్ల తరబడి కరువు కాటకాలు వేధిస్తున్నా.. మొక్కవోని ఆత్మవిశ్వాసంతో, భూమాతపై నమ్మకంతో వ్యవసాయాన్నే నమ్ముకుని ధైర్యంగా ముందడుగు వేసే రైతన్నలు ఎందరో. కానీ కాలం మారుతోంది. అనంత రైతులు టెక్నాలజీ బాట పడుతున్నారు. మూస ధోరణి వీడి.. సరికొత్త సాంకేతిక పద్ధతులతో సాగులో అద్భుతాలు చేస్తున్నారు. సంప్రదాయ విధానాలను పక్కనబెట్టి హార్టీకల్చర్, పండ్ల తోటల సాగులో రాణిస్తున్నారు. హాఫ్ మూన్ స్ట్రక్చర్ విధానాన్ని ఎక్కువగా ఆఫ్రికా దేశాలలో ఉపయోగిస్తుంటారు. వర్షాభావ పరిస్థితులు ఉన్న ప్రాంతాలలో ఈ విధానం ద్వారా వ్యవసాయం చేపడుతుంటారు. హాఫ్ మూన్ స్ట్రక్చర్ అంటే.. కొండకు వాలుగా ఉన్న పొలాలలో అర్ధ చంద్రాకారపు ఆకారంలో గుంతలు తవ్వడం. సాధారణంగా ఈ గుంతలు ఒకటి నుంచి రెండు మీటర్ల వ్యాసం కలిగి ఉంటాయి. ఈ విధంగా చేయడం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేయవచ్చు. అలాగే నేల సారవంతాన్ని పునరుద్ధరించవచ్చు. ఈ విధానం ద్వారా రైతులు భారీగా పెట్టుబడులు లేకుండానే బీడు భూములను పునరుద్ధరించుకోవచ్చు. ఇలా కొండకు వాలుగా గుంతలు తవ్వటం ద్వారా వర్షం కురిసినప్పుడు ఆ వర్షపు నీరు వీటిలో చేరి అక్కడే ఇంకిపోతుంది. కరవు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఈ విధానం అనుసరిస్తుంటారు.అలాంటి ఓ రైతే ప్రమీలమ్మ. ఆఫ్రికా దేశంలో అనుసరించే హాఫ్మూన్ విధానంతో గత ఎనిమిది సంవత్సరాలుగా పంటలు సాగు చేస్తూ రోజువారీ ఆదాయం పొందుతున్నారామె. తన సక్సెస్ స్టోరీతో ఏకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నుంచి కూడా అభినందనలు అందుకున్నారు ప్రమీలమ్మ.కళ్యాణదుర్గం మండలంలోని భట్టువానిపల్లికి చెందిన ప్రమీలమ్మకు మూడు ఎకరాల పొలం ఉంది. అర ఎకరంలో ఏ – గ్రేడ్ పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్నారు ప్రమీలమ్మ. మిగతా రెండున్నర ఎకరాలలో వేరుసెనగ పంట పండిస్తున్నారు. సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను ఉపయోగిస్తూ రసాయనాలకు దూరంగా సొంతంగా తయారుచేసుకున్న జీవామృతాన్ని పిచికారీ చేస్తూ పంటలు సాగు చేస్తున్నారు. ఏ గ్రేడ్ విధానంలో సాగుచేసే ఆకుకూరలు, కూరగాయలతో రోజూ ఆదాయం పొందుతున్నారు. ఎలాంటి రసాయనాలు లేకుండా పూర్తిగా సేంద్రీయ విధానంలో పంటలు పండిస్తూ ఉండటంతో ప్రమీలమ్మ ఇంటివద్దకే వచ్చి కూరగాయలు, ఆకుకూరలు కొనుగోలు చేస్తున్నారు. ఇక ప్రమీలమ్మ గురించి తెలిసిన సీఎం చంద్రబాబు జలహారతి కార్యక్రమంలో ఆమెను అభినందించారు.ఏ గ్రేడ్ సాగు అనేది ప్రకృతి వ్యవసాయంలో ఒక పద్ధతి. ఈ విధానం ద్వారా తక్కువ పెట్టుబడితో, ఒకే సమయంలో ఎక్కువ దిగుబడి పొందవచ్చు. ఒకే పొలంలో, ఒకే సమయంలో ప్రధాన పంటతో పాటుగా అనుబంధంగా మరో మూడు లేదా నాలుగు పంటలు సాగు చేయడాన్ని ఏ గ్రేడ్ మోడల్ అని పిలుస్తుంటారు. ఈ రకంగా వివిధ రకాల పంటలను పండించటం ద్వారా నేల సారం పెరుగుతుందని వ్యవసాయ నిపుణులు చెప్తున్నారు. అలాగే అంతర పంటలుగా కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తే రోజూవారీ ఆదాయం కూడా పొందవచ్చని చెప్తున్నారు. తెలుగు రాష్ట్రాలలో ఈ మధ్యకాలంలో ఈ విధానం పెరుగుతోంది.

## డేటా సెంటర్లు...
## 9.1 గిగావాట్ల ఐటీ విద్యుత్ లోడ్ కు ప్లానింగ్

**విశాఖపట్టణం, జూన్ 13 పెన్ పవర్:** ఏపీలోని విశాఖపట్టణం డేటా సెంటర్లకు కేంద్రంగా మారుతోంది. ఆ మేరకు సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అయితే, డేటా సెంటర్లకు లోటులేకుండా విద్యుత్ ను అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. డేటా సెంటర్ రంగానికి అవసరమైన విద్యుత్ సరఫరా కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దీర్ఘకాలిక పవర్ ట్రాన్స్ మిషన్ రోడ్ మ్యాప్ను రూపొందించింది. రాబోయే పదేళ్లలో డేటా సెంటర్ల విద్యుత్ అవసరం దాదాపు 15 గిగావాట్లకు చేరుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్న ప్రభుత్వం.. అందుకు తగిన విధంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు చేపడుతోంది.విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో డేటా సెంటర్లకు లోటు లేకుండా విద్యుత్ ను అందించేందుకు ప్రణాళికలపై చర్చించారు. విశాఖపట్టణం ప్రాంతంలో ప్రస్తుతం 16భారీ డేటా సెంటర్ ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని ఏపీ ట్రాన్స్కో అంచనా వేసింది. వీటి ద్వారా సుమారు 9.1 గిగావాట్ల ఐటీ విద్యుత్ లోడ్ ఏర్పడనుండగా.. అనుబంధ మౌలిక వసతులు, అంతర్జాతీయ ప్రమాణాల అవసరాలను కలుపుకుని మొత్తం విద్యుత్ డిమాండ్ 2036–37 నాటికి 15 గిగా వాట్లకు చేరే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఈ అవసరాలను తీర్చేందుకు 765 కేవీ, 400 కేవీ, 220 కేవీ స్థాయిల్లో ట్రాన్స్ మిషన్ నెట్ వర్క్ ను అభివృద్ధి చేసేందుకు అధికారులు నిర్ణయించారు.ట్రాన్స్మిషన్ నెట్వర్క్ అభివృద్ధి కోసం పెందుర్తి, అచ్యుతాపురం, పలాస, పద్మనాభం, మాకవారిపాలెం వంటి కీలక సబ్ స్టేషన్లను అనుసంధానించేలా ఈ వ్యవస్థను నిర్మించనున్నారు. ఈ నెట్వర్క్ 2034 నాటికి 15 గిగావాట్లకుపైగా డేటా సెంటర్ లోడ్ను మోయగల సామర్థ్యంతో రూపుదిద్దుకోనుంది. ఈ ప్రణాళికలో భాగంగా రాంబిల్లి డేటా సెంటర్ క్లస్టర్ అభివృద్ధిపైనా అధికారులు ప్రత్యేక దృష్టిని సారించారు. ఈ ప్రాంతంలో భారీ పెట్టుబడుల కోసం కొత్త 400 కేవీ, 200 కేవీ సబ్ స్టేషన్లతో పాటు అధిక సామర్థ్యం కలిగిన ప్రత్యేక విద్యుత్ ప్రసార మౌలిక వసతులు, ట్రాన్స్ మిషన్ కారిడార్లు ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా తార్లువాడ, ముడసర్లోవ, పోలేపల్లి, చిన్నిపాలెం ప్రాంతాల్లో కూడా డేటా సెంటర్ హబ్ల కోసం అవసరమైన విద్యుత్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.గూగుల్, రిలయన్స్, టీసీఎస్ హైపర్వాల్ట్, సీటీఆర్ఎల్ఎస్ , జీఎంఆర్ వంటి ప్రముఖ సంస్థలు విశాఖలో డేటా సెంటర్లు ఏర్పాటు చేయడంపై ఆసక్తి చూపుతున్నాయని అధికారులు వెల్లడించారు. ఈ పెట్టుబడులు రాష్ట్రంలో ఉపాధి అవకాశాలను పెంచడంతో పాటు ఆంధ్రప్రదేశ్ను దేశంలోని ప్రధాన డిజిటల్ మౌలిక వసతుల కేంద్రంగా నిలబెడతాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

## జగన్ కు పాజిటివ్ గా మారుతోందా..

**విజయవాడ, జూన్ 13, పెన్ పవర్:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఏపీలో పటిష్టమైన ఓటు బ్యాంకు ఉంది. అది వచ్చే ఎన్నికల్లోనూ చెక్కు చెదరదన్న నమ్మకంతో వైసీపీ అధినేత జగన్ ఉన్నారు. దీంతో పాటు తమకు అదనంగా మరికొంత బలం తోడవుతుందని, తద్వారా తన గెలుపు ఖాయమని భావిస్తున్నారు. అందుకే అధికార పక్షంపై జగన్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నారు. నేరుగా చంద్రబాబుతో పాటు ఆయన కుమారుడు లోకేశ్ లపైన కూడా విమర్శలు చేస్తూ పాలనలో లోటుపాట్లను మీడియా సమావేశాల ద్వారా బయటపెట్టాలని ప్రయత్నిస్తున్నారు. గత ఎన్నికల్లో తనకు దూరమైన వర్గాలు తిరిగి తన చెంతకు చేరతాయని నమ్ముతున్నారు.గత ఎన్నికల్లో మధ్యతరగతి ప్రజలతో పాటు, రెడ్డి సామాజికవర్గంలోనూ ఓట్లు చీలిపోయాయి. ఉన్నత వర్గాల ఓట్లు ఎటూ రాలేదు. దీంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు కూడా అడ్డం తిరిగారు. తమపై పనిభారం మోపడంతో పాటు తమకు జీతాలు కూడా సక్రమంగా చెల్లించకపోవడం, ప్రయోజనాలు కూడా ఇవ్వకపోవడంతో అసంతృప్తి చెందిన ప్రభుత్వ ఉద్యోగులు దాదాపు 90 శాతం మందికిపైగా నాటి ఎన్నికల్లో కూటమి వైపునకు మొగ్గు చూపారు. అయితే ఇప్పుడు తనకు దూరమైన అన్ని వర్గాల్లో ప్రభుత్వం పట్ల అసంతృప్తి ఉందని జగన్ భావిస్తున్నారు. ఈ



అదనపు బలం దాదాపు పదిశాతం ఓట్లు తనకు యాడ్ అవుతాయని తన సన్నిహితుల వద్ద లెక్కలు చెబుతున్నారని తెలిసిందిగత ఎన్నికల్లో తన సొంత సామాజికవర్గం లో కూడా అసంతృప్తి ఉంది. అయితే ఇప్పుడు పరిస్థితులు మారాయి. రెడ్డి సామాజికవర్గంలో జగన్ పాట్ల సానుభూతి వచ్చిందని భావిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు కూడా గత ప్రభుత్వమే మేలన్న అభిప్రాయంలో ఉన్నారని జగన్ భావిస్తున్నారు. అందుకే ఈ సారి ఎన్నిలకు ముందు జగన్ కొన్ని కీలక నిర్ణయాలు ప్రకటిస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ సారి జగన్ హామీలు కూడా భారీగా ఉంటాయని అంటున్నారు. రైతులు, మహిళలు, ఉద్యోగులకు సంబంధించి కీలక హామీలను ప్రకటిస్తారని, అందుకే జగన్ అన్ని లెక్కలు వేసుకునిఈసారి తనదే అధికారమన్న ధీమాలో ఉన్నారన్నది పార్టీ వర్గాలు చెబుతున్న మాట.

# భారత్-పాక్ మ్యాచ్ అంటే అదే ఒత్తిడి.. వాచ్‌మన్ మాట గుర్తుచేసిన జెమీమా

- మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత్, పాకిస్థాన్ మధ్య మ్యాచ్
- ఆదివారం నాడు జరగనున్న దాయాదుల సమరం
- పాక్‌తో మ్యాచ్ అంటే తీవ్ర ఒత్తిడి ఉంటుందన్న జెమీమా రోడ్రిగ్స్
- ఎవరితో ఓడినా పాక్‌తో వద్దని వాచ్‌మన్ అన్నాడని వెల్లడి
- ట్రోఫీ గెలిచినట్టు ఊహించుకుంటూ మానసికంగా సిద్ధమవుతున్నామన్న టీమిండియా



**హైదరాబాద్ పెన్ పవర్:** "ఎవరితో మ్యాచ్‌లో అయినా ఓడిపోవచ్చు కానీ పాకిస్థాన్‌తో మాత్రం ఓడిపోవద్దు" అని తన బిల్డింగ్ వాచ్‌మన్ కూడా తనతో అన్నాడని టీమిండియా బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ వెల్లడించింది. భారత్-పాకిస్థాన్ మ్యాచ్ అంటే ఎంతటి తీవ్రమైన ఒత్తిడి ఉంటుందో అర్థం చేసుకోవడానికి ఇదొక నిదర్శనమని ఆమె వ్యాఖ్యానించింది. మహిళల టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా ఆదివారం (జూన్ 14) పాకిస్థాన్‌తో జరగనున్న తొలి మ్యాచ్‌కు ముందు ఆమె ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. బర్మింగ్‌హామ్ వేదికగా జరగనున్న ఈ మ్యాచ్‌తో ఇరు జట్లూ తమ ప్రపంచకప్ ప్రస్థానాన్ని ప్రారంభించనున్నాయి. ఈ నేపథ్యంలో జియోస్టార్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో జెమీమా మాట్లాడుతూ, "భారత్-పాక్ మ్యాచ్‌ల చరిత్ర, అభిమానుల అంచనాల వల్ల బయటి నుంచి ఒత్తిడి ఉంటుందన్నది వాస్తవం. దీన్ని మనం కాదనలేం" అని హర్మన్‌ప్రీత్ కౌర్ డ్రెస్సింగ్ రూమ్‌లో తమతో చెబుతుంటుందని జెమీమా గుర్తుచేసుకుంది.

అయితే, ఈ ఒత్తిడిని అధిగమించి దీర్ఘకాలిక లక్ష్యాలపై దృష్టి పెట్టడానికి జట్టు పక్కా ప్రణాళికతో సిద్ధమవుతోందని ఆమె వివరించింది. జట్టు సన్నద్ధతలో కోచ్ అమోల్ మజుందార్ కీలక పాత్ర పోషిస్తున్నాడని తెలిపింది. 2025 వన్డే ప్రపంచకప్‌ను గెలిచిన స్ఫూర్తితో ఆడతామని వ్యాఖ్యానించింది. ప్రతి మ్యాచ్‌కు విభిన్న వ్యూహాలతో సన్నద్ధమవుతామని వెల్లడించింది. ముఖ్యంగా జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు ఒత్తిడిని తట్టుకుని ఎలా రాణించాలో ప్రత్యేకంగా శిక్షణ పొందుతున్నామని జెమీమా పేర్కొంది.

# టీమిండియా-ఆఫ్ఘనిస్థాన్ తొలి వన్డే.. ఎట్టకేలకు ప్రారంభమైంది!



**హైదరాబాద్ పెన్ పవర్:** ధర్మశాల వేదికగా ఆఫ్ఘనిస్థాన్‌తో తొలి వన్డే మ్యాచ్‌లో భారత్ టాస్ గెలిచింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మొదట బౌలింగ్ చేయాలని నిర్ణయించుకున్నాడు. దీంతో ఆఫ్ఘనిస్థాన్ జట్టు తొలుత బ్యాటింగ్ చేయనుంది. భారీ వర్షం కారణంగా బాగా ఆలస్యంగా ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో, వాతావరణం బౌలర్లకు అనుకూలించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఓవర్లను 25కి కుదించారు. ఈ సిరీస్‌లో యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్ భారత జట్టుకు నాయకత్వం వహిస్తున్నాడు. సీనియర్ ఆటగాడు రోహిత్ శర్మ ఈ మ్యాచ్ ద్వారా జట్టులోకి తిరిగి వచ్చాడు. భారత తుది జట్టులో ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్‌లకు చోటు దక్కింది. యువ ఆటగాళ్లు నితీశ్ కుమార్ రెడ్డి, హర్ష్ దూబే, గుర్నూర్ బ్రార్ కూడా జట్టులో స్థానం సంపాదించారు. మరోవైపు, హష్మతుల్లా షాహిది కెప్టెన్సీలోని ఆఫ్ఘనిస్థాన్ జట్టు కూడా బలంగా కనిపిస్తోంది. ఆ జట్టులో ఇబ్రహీం జద్రాన్, రహ్మానుల్లా గుర్బాజ్, మహ్మద్ నబీ, స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ వంటి కీలక ఆటగాళ్లు ఉన్నారు.

**తుది జట్లు:**

భారత్: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, వాషింగ్టన్ సుందర్, నితీశ్ కుమార్ రెడ్డి, హర్ష్ దూబే, గుర్నూర్ బ్రార్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ.

ఆఫ్ఘనిస్థాన్: ఇబ్రహీం జద్రాన్, రహ్మానుల్లా గుర్బాజ్ (వికెట్ కీపర్), సెదిఖుల్లా అటల్, రహ్మత్ షా, హష్మతుల్లా షాహిది (కెప్టెన్), అజ్మతుల్లా ఒమర్జాయ్, మహ్మద్ నబీ, రషీద్ ఖాన్, మహ్మద్ సలీమ్ సఫీ, ఏఎం గజన్ఫర్, జియా ఉర్ రెహ్మాన్ షరీఫీ.

# IPL రికార్డ్స్ ఔట్, చరిత్రలోనే బిగ్గెస్ట్ ఈవెంట్‌గా ఫిఫా.. గ్లోబల్ జీడీపీకి బూస్ట్ ఇచ్చిన వరల్డ్ కప్





**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా, కెనడా, మెక్సికో దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఫిఫా వరల్డ్ కప్ (FIFA World Cup 2026) కేవలం ఒక ఫుట్‌బాల్ టోర్నమెంట్ మాత్రమే కాదు.. ప్రపంచ క్రీడా చరిత్రలోనే అతిపెద్ద ఆర్థిక, సాంకేతిక, సాంస్కృతిక విప్లవంగా మారబోతోంది. మునుపెన్నడూ లేని విధంగా 48 జట్లు, బిలియన్ల కొద్దీ వ్యూవర్స్, వేల కోట్ల రూపాయల బిజినెస్‌తో ఈ మెగా ఈవెంట్ సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది.

**చరిత్రలోనే అతిపెద్ద వరల్డ్ కప్:**

గతంలో కేవలం 32 జట్లతోనే జరిగిన ఈ మెగా టోర్నీని.. ఈసారి ఫిఫా ఏకంగా 48 జట్లకు పెంచింది. దాంతో, ఫ్యాన్స్‌కు ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇచ్చేందుకు 16 నగరాల్లో, 39 రోజుల పాటు రికార్డు స్థాయిలో 104 మ్యాచులు జరగబోతున్నాయి. ఇక గ్లోబల్ పార్టిసిపేషన్‌ను పెంచాలనే ఫిఫా ప్లాన్‌తో ఈసారి కురాకో, కాబో వెర్డే, జోర్డాన్, ఉజ్బెకిస్తాన్ లాంటి 4 దేశాలు తమ ఫస్ట్ వరల్డ్ కప్ మ్యాచ్ ఆడబోతున్నాయి. బ్యాంక్ ఆఫ్ అమెరికా (దీశీటూ) గ్లోబల్ రీసెర్చ్ ప్రకారం.. ఈ మ్యాచులను నేరుగా స్టేడియాల్లో చూసేందుకు సుమారు 65 లక్షల మంది (6.5 Million) ప్రేక్షకులు రాబోతున్నారు.

**600 కోట్ల మంది వ్యూవర్స్:**

ప్రపంచ జనాభాలో దాదాపు ముప్పావు వంతు (చీముతీశ్రీఎ 75శాతం) మంది ఈ వరల్డ్ కప్‌ను టీవీలు, ఓటీటీలు, డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా చూడబోతున్నారని ఫిఫా అంచనా వేసింది. గత ఖతార్ వరల్డ్ కప్‌ను 500 కోట్ల మంది చూస్తే.. ఈసారి ఆ రికార్డు బద్దలై ఏకంగా 600 కోట్ల మంది (6 Billion) ఈ టోర్నీని ఫాలో అవ్వబోతున్నారు. ఫైనల్ మ్యాచ్ జరిగే రోజున ప్రపంచవ్యాప్తంగా ఉండే మొత్తం ఇంటర్నెట్ ట్రాఫిక్‌లో దాదాపు 7శాతం ట్రాఫిక్ కేవలం ఈ ఫుట్‌బాల్ మ్యాచ్ వల్లే జనరేట్ అవుతుందని విశ్లేషకులు చెప్తున్నారు.

**గ్లోబల్ జీడీపీకి బూస్ట్:**

ఫిఫా అండ్ వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (WTO) సంయుక్త సర్వే ప్రకారం.. ఈ వరల్డ్ కప్ ద్వారా గ్లోబల్ జీడీపీకి ఏకంగా 40.9 బిలియన్ డాలర్లు (సుమారు ?3.90 లక్షల కోట్లు) యాడ్ అవ్వబోతున్నాయి. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా టూరిజం, హోటల్స్, ట్రాన్స్‌పోర్ట్, రీటైల్ రంగాలలో 8.24 లక్షలకు పైగా కొత్త ఉద్యోగాలు క్రియేట్ అవుతాయి.

**అమెరికాకు బంపర్ ఆఫర్:**

మూడు దేశాలు ఆతిథ్యమిస్తున్నా.. సింహభాగం లాభాలు అమెరికాకే దక్కనున్నాయి. యుఎస్ జీడీపీకి వి17.2 బిలియన్లు (సుమారు 1.64 lakh కోట్లు) అదనంగా సమకూరనున్నాయి. కాగా అమెరికాలోనే దాదాపు 1.85 లక్షల కొత్త ఉద్యోగాలు క్రియేట్ కానున్నాయి.

**ఐపీఎల్, ఎన్ఎఫ్ఎల్ రికార్డులు ఔట్:**

ప్రపంచవ్యాప్త బ్రాండ్స్ అన్నీ ఈ వరల్డ్ కప్‌లో యాడ్స్ ఇవ్వడానికి ఎగబడుతున్నాయి. గ్లోబల్ అడ్వర్టైజర్స్ కేవలం ఈ టోర్నమెంట్ కోసమే ఏకంగా 10.5 బిలియన్ డాలర్లు (సుమారు ?10,500 కోట్లు) ఖర్చు చేయబోతున్నారు. ఇది భారత్ లో జరిగే ఐపీఎల్ తో పాటు అమెరికాలో మోస్ట్ పాపులర్ అయిన ఎన్ఎఫ్ఎల్ ఫుల్ సీజన్ యాడ్స్ ఖర్చు కంటే డబుల్ కావడం విశేషం. దీంతో బ్రాడ్‌కాస్టింగ్ రైట్స్, స్పాన్సర్‌షిప్స్, టికెట్ సేల్స్ ద్వారా ఫిఫా సంస్థ రికార్డు స్థాయిలో 8.9 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని టార్గెట్ చేసింది. ఇప్పటికే టాప్-టైర్ స్పాన్సర్‌షిప్ ప్యాకేజీలన్నీ హాట్ కేకుల్లా అమ్ముడైపోయాయి.



శ్రుతి హాసన్ ఐవరీ లెహంగా లుక్ క్లాసిక్ సొగసుకు కొత్త నిర్వచనాన్ని ఇస్తోంది

# పాన్ మసాలా ప్రకటన వివాదం: సల్మాన్ లాయర్ చాలా గట్టోడే!



బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్ ఖాన్‌కు చట్టపరమైన పాత వివాదం ఒకదానిలో తాత్కాలిక ఉపశమనం లభించింది. డబ్బు కోసం ఒక ప్రముఖ పాన్ మసాలా బ్రాండ్ ప్రకటనలో నటించి వినియోగదారులను తప్పుదోవ పట్టించారంటూ దాఖలైన ఫిర్యాదు ఆధారంగా నడుస్తున్న జిల్లా వినియోగదారుల ఫోరమ్ విచారణా ప్రక్రియను నిలిపివేస్తూ జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (ఎన్‌సిడిఆర్‌సి) కీలక ఆదేశాలు జారీ చేసింది. రాజస్థాన్‌లోని కోటా జిల్లా వినియోగదారుల ఫోరమ్ (డిసిడిఆర్‌సి) గతంలో సల్మాన్ ఖాన్ సహా పలువురి సంతకాలను ధృవీకరించాలంటూ ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ దాఖలైన అప్పీల్‌పై జాతీయ కమిషన్ విచారించింది. ఈ కేసును పరిశీలించిన ఎన్‌సిడిఆర్‌సి అధ్యక్షులు జస్టిస్ ఎ.పి. సాహి, ఇతర సభ్యులు భరత్ కుమార్ పాండ్యాలతో కూడిన ధర్మాసనం.. ఫిర్యాదుదారుడైన ఇంద్ర మోహన్ సింగ్ అలియాస్ హనీకి నోటీసులు జారీ చేసింది. జూన్ 10న ఇచ్చిన తమ ఉత్తర్వుల్లో తదుపరి ఆదేశాలు వచ్చే వరకు కోటా జిల్లా ఫోరమ్‌లో ఈ వివాదానికి సంబంధించిన ఎలాంటి విచారణలు ముందుకు సాగడానికి వీల్లేదని, స్టే విధిస్తున్నామని కమిషన్ స్పష్టం చేసింది. ఈ వివాదంలో జిల్లా ఫోరమ్ తన పరిధిని దాటి వ్యవహరించిందనే అప్పీలుదారుల వాదనపై లోతైన విచారణ జరపాల్సిన అవసరం ఉందని జాతీయ కమిషన్ అభిప్రాయపడింది. సల్మాన్ ఖాన్ తరపున హాజరైన న్యాయవాదుల వాదనలు వినిపిస్తూ.. అసలు వినియోగదారుల చట్టం ప్రకారం.. ఈ ఫిర్యాదుకు విచారణార్హత ఉందా లేదా అనేది ప్రాథమికంగా తేల్చకుండానే జిల్లా ఫోరమ్ నేరుగా సంతకాల ప్రామాణికతను చెక్ చేయాలంటూ ఆదేశాలు ఇవ్వడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. అంతేకాకుండా ఇదే సంతకాల ధృవీకరణ ఆదేశాలపై గతంలో మే 27న రాజస్థాన్ హైకోర్టు కూడా స్టే ఇచ్చిందని వారు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. సెలబ్రిటీలను వేధించడమే లక్ష్యంగా ఇటువంటి ఫిర్యాదులను చట్టపరమైన ప్రక్రియను దుర్వినియోగం చేస్తూ వేర్వేరు ఫోరమ్‌లలో దాఖలు చేస్తున్నారని అప్పీలుదారులు ఆరోపించారు. ఈ పాన్ మసాలా ప్రకటన వివాదం దేశవ్యాప్తంగా గతంలోనే పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. సల్మాన్ ఖాన్ వంటి అగ్ర శ్రేణి నటుడు ఇటువంటి హానికరమైన ఉత్పత్తుల ప్రకటనల్లో నటించి వినియోగదారులను.. ముఖ్యంగా యువతను తప్పుదోవ పట్టిస్తున్నారనేది ప్రధాన ఫిర్యాదు. ఈ తాజా స్టే ఉత్తర్వుల కాపీని జిల్లా ఫోరమ్ రికార్డులలో ఉంచాలని ఆదేశించిన ఎన్‌సిడిఆర్‌సి.. తదుపరి తుది విచారణను జూన్ 22వ తేదీకి వాయిదా వేసింది. అంతవరకు ఈ కేసులో సల్మాన్ ఖాన్‌కు ఎలాంటి చట్టపరమైన ఇబ్బందులు ఎదురుకాకపోవడం గమనార్హం. సెలబ్రిటీల వాణిజ్య ప్రకటనలపై వినియోగదారుల చట్టం ఇటీవల కాలంలో చాలా కఠినంగా వ్యవహరిస్తోంది. ఒక ఉత్పత్తిని ప్రమోట్ చేసేటప్పుడు సదరు స్టార్స్‌కు కూడా బాధ్యత ఉంటుందని చట్టాలు చెబుతున్నా.. ప్రొసీజర్ - పరిధిని దాటి కోర్టులు ఆదేశాలు ఇవ్వకూడదనే కోణంలో ఈ తాజా తీర్పు ఉన్నట్లు కనిపిస్తోంది. జూన్ 22న తదుపరి విచారణలో జాతీయ కమిషన్ ఎలాంటి నిర్ణయం తీసుకోబోతోందనే అంశంపై అటు సల్మాన్ ఖాన్ అభిమానులతో పాటు లీగల్ వర్గాలలోనూ ఆసక్తి నెలకొంది.



సోషల్ మీడియాలో శివాంగి వర్మ హుందైన చీరకట్టు లుక్ అందరి మనసులను గెలుచుకుంది

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D V RAO, FLAT NO: 402, VIGNESWARA PRANATHI REDDY TOWERS, OPP. BHARAT PETROLBUNK, VIDYANAGAR, TIRUPATI Dist.,editor GANTYADA APPARAO. PRGI Registration No. "APTEL/25/A4409" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965